వచన కవితలు



కవితా ప్రసాద్

అంకితం

జీవితం ఓ వరద ప్రవాహం!
స్నేహం ఓ వర ప్రసాదం!
ఓ కట్టె వరదలో కొట్టుకు పోతూంటుంది!
మధ్యలో కొన్ని వచ్చి తోడు చేరుతాయి!
కొన్ని చందనపువి! కొన్ని టేకువి!
కొన్ని సంపంగి పూలవి! కొన్ని సహకార ఫలాలవి!
కొన్ని పుడకలు! కొన్ని దుంగలు!
కొన్ని మధ్యలోనే విడిపోయేవి!
కొన్ని అంతు దాకా అంటిపెట్టుకొనుండేవి!
ఈ దాదాపు డెబ్బై ఏళ్ళ జీవిత ప్రవాహంలో
ఆత్మీయతతోనో, ఆప్యాయతతోనో
గౌరవంతోనో, జాలి తోనో
అపేక్షతోనో, నిరపేక్షతోనో
మరేదేని ఒక.....తోనో
అడిగినప్పుడైనా, అడగనప్పుడైనా
అండ దండలుగా నిలబడిన
మిత్ర బృందానికి, సుహృద్బంధానికి
ఈ కృతి సార్ద్ర హృదయంతో అంకితం!
కుచేలురైనా, కృష్ణ మూర్తులైనా
చిన్నైనా! పెద్దైనా!
ఎందరి పేర్లని చెప్పను!
అందరికీ అభివందనాలతో!

మీ "మన" వాడు

కవితా ప్రసాద్

వచన కవితలు

రచన

కవితా ప్రసాద్

శంకరాభరణం

శరణం పండిత మానసాపహారణం, శశ్వద్యశఃకారణం, సరసానందద వాగ్విలాస చరణం, శబ్దార్థ సంపూరణమ్।
చరదత్యద్భుత సత్కవీశ్వరగణం, సాలంబనం 'శంకరాభరణం', నిత్యమహం స్మరామి విలసద్ వాగ్దివ్యసింహాసనమ్

వచన కవితలు

రచన: కవితా ప్రసాద్

శంకరాభరణం ప్రచురణలు: 78

ప్రథమ ముద్రణ: ఫిబ్రవరి 2024

ప్రతులు: 100


ప్రాప్తిస్థానం: Kavitha Prasad,
73-18-8/1F, S2 - Sree Nandanam Apt.,
Sree Balaji St., (Near Venkateswara Temple),
A.V. Apparao Road,
Rajamahendravaram-533103 (AP)
✆: 9490168907

రూపకల్పన: పంతుల విట్టుబాబు, హైదరాబాద్ ✆85550 82034
ముద్రణ: కర్షక్ ఆర్ట్ ప్రింటర్స్, హైదరాబాద్ ✆9866661478

ఇందులో...

కవితలు

కుదురాటగండ, అసమాన అవధాన సార్వభౌమ,
కాశీకవి, శతావధాని
డా.పాలపర్తి శ్యామలానంద ప్రసాద్



పచన కవిత – రచన భవిత

పద్య కవిత్వం సాంప్రదాయికం

వచన కవిత ఆధునికం, అభ్యుదయం -

అని అడ్డంగా గీతలు గీసే విమర్శ పునరాలోచించుకొని పరిభాష మార్చుకొనేటట్లు కవితా ప్రసాద్ గారి ఈ పచన కవితా సంపుటి నామకరణంలో, సమీకరణంలో, వ్యాకరణంలో, కరణంలో, రణంలో అన్నింటా ఆనుశాసనిక పర్వంగా, ఆధికారికంగా అలరారుతోంది. పద్యం, వచనం, పై పొట్టు పేరు ఏదయినా లోపలి గింజ కవిత్వం. వట్టి పొట్టుతో జరిగేది ఊకదంపుడే. ఏదీ అసలైన కవిత్వం కాదు. సిసలైన కవిత్వపు గింజకు పొట్టు ఏదయినా దానిని కాపాడుతుంది. మళ్ళీ మళ్ళీ మొలకెత్తిస్తుంది. **వ**చన కవిత **ప**చన కవిత కావటంలో ఇంత కావ్య శాస్త్ర చర్చ దాగి ఉంది. పాఠకునికీ శ్రోతకూ పచనం కాని కవిత్వం పేరు ఏదయినా దాని ఊరు చెత్తబుట్టే.

కవితా ప్రసాద్ గారు నాకు బాబాయి వరుస. తెలుగు వాళ్ళు పోలీసుల్ని కూడా 'బాబాయి' అంటారు. వారి చేతిలో లాఠీ ఉంటుంది, తుపాకీ ఉంటుంది. శాల్యూటూ ఉంటుంది. సమయ సందర్భాలను బట్టి దేనిని ఎప్పుడు ఉపయోగించాలో దానిని అప్పుడు ఉపయోగిస్తారు. మా కవి బాబాయి పచన కవితా సంపుటిలో లాఠీ ఛార్జీలు, ఫైరింగులూ, శాల్యూట్‌లూ, బందోబస్తులూ అన్ని కవితలూ ఉన్నాయి.

జాగరం యే కరిష్యంతి గీతాశాస్త్ర పురః నరమ్
ఉద్ధరిష్యంతి యే మర్త్యాః కులమేకోత్తరం శతమ్ (స్కాందం)

గీతాధ్యయనం చేస్తూ జాగారం చేసేవారు వంశాన్ని నూటొక్క తరాలు ఉద్ధరిస్తారని 'నూటొక్క తరాలు' కొలతగా పురాణాలు చెబుతూ ఉంటాయి. 'కవిత్వ వంశాన్ని' నూటొక్క తరాలు ఉద్ధరించే విధంగా ఇందులో 'నూటొక్క కవితలు', వేదాంతాన్ని, ఆధ్యాత్మికాన్ని, సామాజికాన్నీ, సాంఘికాన్నీ, శృంగారాది నవరసాలను పండించి వండించే ప్రక్రియకు ప్రణాళికకూ ప్రవేశద్వారాలుగా కవిత్వోద్ధరణకు స్వాగతం పలుకుతున్నాయి.


ఈ పచన కవితలు చదవటం ఆరంభించగానే కనులు అక్షరాలతో కలబడతాయి. కొన్నిచోట్ల ఎట్టబడతాయి. కొన్నిచోట్ల వర్షిస్తాయి. కొన్నిచోట్ల అర్ధనిమీలితం అవుతాయి. కొన్ని చోట్ల పెద్దవౌతాయి. కొన్ని వైదికం, కొన్ని లౌకికం, కొన్ని జ్యోతిషం, కొన్ని భౌతిక శాస్త్రం, కొన్ని రసాయన శాస్త్రం ఇన్నింటి కదంబ ప్రసాదమే ఈ పచన కవితా ప్రసాదం. ఇది పాఠకులందరి పక్షాన నా ఆమోదం. ఆస్వాదం. స్వస్తి.

మంగళగిరి.
21.12.2023.

కం. ఏత్తై పారిన ఎన్నెల
లో రాగం కొత్తదొకటి లోలాకయ్యే
పేరొకటి చాలు బాబాయ్
నూరేళ్లూ నిలుచుకైత నులివెచ్చనిదై!

(ఆనంద కైరవి కవితకు పాలపర్తి వారి స్పందన)

వారణాసి సుబ్రహ్మణ్యం
సీనియర్ జర్నలిస్టు, సాహిత్య విశ్లేషకులు
సంపాదకులు - **గోదావరి ప్రభ**
రాజమహేంద్రవరము



చమత్కారం మనోహరంగా...

వచన కవితలు ..పేరులోనే ఓ చమత్కృతి. అర్థం చేసుకోవడానికి కూడా ఒక స్థాయి కావాలి. ఆ స్థాయి పూర్తిగా నాకు ఉన్నదని నేను ఆత్మ వంచన చేసుకోను..కానీ లోచూపు తెరుచుకుంటుంది మీ కవితలు చదువుతూంటే ..

శుభొదయం, ఐరావతం వంటి కాలభైరవులు.. నిత్యం మనకు తప్పవు. సరి కొత్త ప్రయోగాలతో వాస్తవాలను చెప్పారు.

గుండెలు నిండట్లేదు, నిండుకుంటున్నాయి.... అద్భుత వ్యక్తీకరణ. శౌనకీయం కవిత చాలా అర్థవంతంగా ఉన్నది. ఒకటికి రెండు సార్లు చదివి ఆనందించాను. ఆనందకైరవి పేరుకు తగ్గ అనుభూతి కవిత. నిశ, శశిరేఖ, అమావాస్య, అనంత శయనం వంటివి మంచి ఊహ చిత్రాలు.

కవితలన్నీ చాలా లోతయిన భావంతో అలరిస్తున్నాయి. న్యూమరాలజీ కవితలో You have given timely message to present day youth. గట్టెక్కాడు, తత్ బ్రహ్మ, తూర్పు-పడమర, వర్జ్యం - వేదాంత సారం అంతా చిన్న చిన్న కవితలలో పొందు పరిచారు.... ..

కరణ్యేవాధికారస్తే...కవిత నేటి వాస్తవం.

Your poems are unique in several ways. Thought provoking... ఉపనిషదిజం -

పాప పుణ్యాల పెట్టుబడితో మన బ్రతుకు ...అద్భుతమైన వివరణ. చిన్న పదాలతో ఆకాశం అంత భావాన్ని పొందుపరిచారు. ఎరుపులూ, అరుపులే కవితలుగా ఎక్కువగా చెలామణి ఔతున్న ఈ రోజుల్లో భావాల మెరుపులతో ఈ కవితలు ఒక మైమరపు.

రాను రాను కవితలు వ్రాసే వారి సంఖ్య పెరుగుతోంది.. కానీ పదాల భావాలను, స్వభావాలను అర్థం చేసుకుని వ్రాసే వారి సంఖ్య తగ్గుతోంది. మీ కవితలలో కొండను అద్దంలో విజయ వంతంగా చూపించ గలుగుతున్నారు.. మీరు సార్థక నామధేయులు.

చాలా కవితలలో చమత్కారం మనోహరంగా ఉన్నది.. ఒక్క ప్రాచీన కవులే ఇటువంటి చమత్కారాలు అందించగలరు....ఆ కోవకు చెందిన వారే కవితా ప్రసాద్ గారు..ఆయన నివురు గప్పిన నిప్పు...అని నిశ్చయంగా చెప్పగలను. బహుశా ఈ కాలంలో ప్రతిభావంతులకు తగిన గుర్తింపు ఉండదేమో..

హైదరాబాద్. వారణాసి సుబ్రహ్మణ్యం
17.01.2024.

ముందు వాగుడు

కొన్ని ఒలికాయి.
కొన్ని పలికాయి.
కొన్ని వ్రేళ్ళు గిలికాయి.
ఏలాగోలా ఈ గోల ఒడ్డు గోలలన్నీ అచ్చా అయ్యాయి.

అందుకు గాను ముందస్తుగా ఆ పత్రికాధిపతులకు ధన్యవాదాలు. ఆ పత్రికలు అంటే - తెలుగు లోకం, సరికొత్త సమాచారం, గోదావరి ప్రభ మఱోటి ప్రజాపత్రిక అన్నమాట. ప్రచురితమౌతున్న వాటిల్లో మంచివి తక్కువ ఉంటున్నాయో లేక మంచివి తక్కువగా ప్రచురితమౌతున్నాయో తేలని విషయం. అందుకని, ఆ వెతుకులాట వదిలేసి, ఈ పచన కవితల సమాహారాన్ని ఓ సారి చదివేయండి. ఊసుపోకుంటే ఎప్పుడైనా మరోసారి. ఆ మాత్రం చాల్లెద్దురూ. ధన్యోహం. కాలక్షేపం బఠాణీలైనా వేడిగా కరకర లాడుతుంటేనే రుచి. వీటిల్లో ఆ రుచి ఉందా అని అనుమానం వస్తే మాఘ, కుంతక, ఆనందవర్ధనుల వంటి వాళ్ళ ట్రేడ్మార్క్‌ల కోసం వెతకండి. అవి పద్యకవిత్వానికే పరిమితం కాదు సుమీ! ఎక్కడైనా అనిపించినా కనిపించినా అరచేతులతో చర్చరించండి. (....చకపోతే మీ కుచేలురతోనో కృష్ణులతోనో చర్చించండి. "బాధ"లను మిత్రులతో పంచుకోవాలనే కదా వాళ్ళ కథా సారాంశం!). నాకు వినబడవు గదాని మానేయకండి.

ఈ కవితల వంటకాలను ఆసాంతం ఓపికగా రుచి చూసే తంటా పడి తమ ఆమోదం పట్టా సర్టిఫికెట్టు ప్రదానం చేసిన ప్రసిద్ధ కవిశేఖరులు, సంస్కృతాంధ్ర అచ్చతెనుగు శతావధాని, అసమాన అవధాన సార్వభౌమేత్యానేక బిరుదాంకితులు డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ గారి సహృదయతకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతాంజలి సమర్పిస్తున్నాను.

శ్రీ వారణాసి సుబ్రహ్మణ్యంగారు, ప్రసిద్ధ స్వాతంత్ర్య యోధులు బ్రహ్మజోస్యుల సుబ్రహ్మణ్యం గారి దౌహిత్రులు. ప్రముఖ పాత్రికేయులు.

పూర్వతనేదానీంతన సాహిత్యపు లోతులను బాగా “ఎఱిగిన” వారు. గోదావరి ప్రభ అనే ఆధ్యాత్మిక త్రైమాసిక పత్రికను కూడా నిర్వహిస్తున్నారు. నేను వ్రాసిన కవితలను పద్యాలను తప్పకుండా చదివి విశ్లేషిస్తూ ఉండే రసజ్ఞ సాహితీ సుహృద్బంధువు. ఈ సంపుటిలోని కవితలపై వారి ఆత్మీయాభిప్రాయాన్ని ప్రసాదించినందుకు వారికి నా హార్దిక ధన్యవాదాంజలి.

ఒకప్పుడు వ్రాసేవాడు కష్టపడేవాడు. చదివేవాడు ఉత్సాహపడేవాడు. ఇప్పుడు వ్రాసేవాడు ఉత్సాహపడుతున్నాడు. చదివేవాడు నానా కష్టపడుతున్నాడు. ఈ నా వంద ఐటమ్‌ల గోదావరి సరికొత్త అల్లుడికి విందులాంటి వంటకం ఎలా ఉందో మీరు కూడా చెప్పాలి సుమీ. నాకు మనో శ్రోత్రాలు (దుష్ట సమాసం కదా! నస్ అనుకోండి) లేవు కాని సెల్ ఫోన్ శ్రోత్రాలున్నాయి. బాగా అలవాటు పడ్డాయి కూడానూ! ఏ మేక్ ఐనా ఓ.కె. ఉపయోగించవచ్చు.

అన్నట్లు, చక్కగా డి.టి.పి & ముఖపత్రపు కూర్పు చేసిన, ముఖ్యంగా పై శీర్షికలో “ముం” లోంచి కొమ్ము తీసేయకుండా జాగ్రత్త వహించిన, శ్రీ విట్టుబాబు గారికి కష్టమరీగా కాక ఇష్టమరీగానే ధన్యవాదములు తెలుపుతున్నాను.

శలవా మఱి!

ఇప్పటికేనండోయ్!

రాజహేంద్రవరము. **కవితా ప్రసాద్**

18.01.2024

స్వేచ్ఛా క్రీడ

నన్ను పుట్టించావు!
నాకు దన్నుగా నిలిచేవాళ్ళను
నా వెన్ను విరిచే వాళ్ళను
నన్ను చూసి మెచ్చే వాళ్ళను
నన్ను చూసి ఏడ్చే వాళ్ళను
నాకు దారి చూపే వాళ్ళను
నా దారిలో ముళ్ళు నాటే వాళ్ళను
నన్ను పైకి త్రోసే వాళ్ళను
నన్ను క్రిందకు లాగే వాళ్ళను
నన్ను దీవించే వాళ్ళను
నన్ను శపించే వాళ్ళను
నన్ను ప్రేమించే వాళ్ళను
నన్ను ద్వేషించే వాళ్ళను
నన్ను సంతోష సంద్రంలో తేలించే వాళ్ళను
నన్ను శోక బడబాగ్నిలో కాల్చేసే వాళ్ళను
ఇంత మందిని! ..ఇంత మందిని!
నాకోసం సృష్టించాల్సి వచ్చిందా ప్రభూ!
నాలో ఉన్న నీవు
మళ్ళీ ఇన్ని రూపాలు ధరించాల్సి వచ్చిందా!
నా కోసమైనా...నీ కోసమైనా
ఎంత శ్రమ పడ్డావు తండ్రీ!

2 గట్టెక్కాడు

తొల్లి ఎప్పుడో....
ఓ పూర్వా సంధ్యా సమయంలో
అపార కూపార తీరంలో
దిగంతాలకేసి దృక్కు సారిస్తూ
విస్మయ పడ్డాము!
“ఆవలి ఒడ్డు ఎంత దవ్వులో
ఉంటుందా” అని!
“అసలది ఉంటే కదా!.....”
మాలో ఒకడు... వాడు అన్నాడు.
“కడలికి ఒకటే గట్టు..
అద్వితీయం!!”
మా అందరిలో అయోమయం..



వెలుగు పువ్వు విచ్చుకుంది!
అంతటా హర్షాతిరేకం!
అంతలోనే నిరాశ పడ్డాం
నాల్గు జాముల ముచ్చటే కదా!”
“మనం వెలుగుతూనే ఉంటాం
ఎప్పుడూ...
ఇప్పుడు వచ్చిందీ లేదు
అప్పుడు పోయేదీ లేదు”
అన్నాడు... వాడే మళ్ళీ!
వాడంతే! ఏకో నారాయణుడు!
మేము ఉత్తరం వైపు చూస్తుంటే
వాడు దక్షిణం వైపే చూస్తాడు
అదొక అంతుబట్టని తత్త్వం!
మాదేమో సంసారారణ్యం
వాడిదేమో నైమిశారణ్యం
మా చింత సంసారచక్రం!
వాడి చింతన సహస్రార చక్రం!
తర్వాత్తర్వాత “పైకీ క్రిందికీ”
ఎన్నెన్ని మార్లు తిరిగుంటామో!
వాడైతే మళ్ళీ తగల్లేదెక్కడా!
ఉనికినే ఊడ్చేసుకొన్నాడేమో మతి!
బిందువులోకి చేరిన వాడికి
బొందితో పొందెక్కడుంటుంది!

3 కొంగు ముడి

ఆడపడుచులూ! అమ్మలూ!
మీ అన్నల్నూ! కొడుకుల్నూ!
వదినలు కోడళ్లూ
కొంగున ముడేసుకొన్నారంటూ
ఎందుకీ ఆడి పోసుకోవటం?
సత్యం వద! ధర్మం చర!
వాళ్ళు పెళ్ళప్పుడు బ్రహ్మ వేసిన
కొంగు ముడిని అలాగే ఉంచుకొన్నారు!
మీరే కొంగు చించేసుకొని
తాళి తీసేసుకొని
మొగసాలెక్కి గగ్గోలు పెడుతున్నారు!
ఐనా మీ మొగుళ్ళు
వాళ్ళ కొంగున మిగిలి ఉన్న
ఆ ముడిని పట్టుకొని పాపం
ఇంకా వేళ్ళాడుతూనే ఉన్నట్లున్నారు!
చేతనైతే
మీ చించేసిన కొంగును మళ్ళీ
దాంతో కలిపి కుట్టుకోండి!
మీరూ మొగుణ్ణి కట్టేసుకోండి!
ఎవరొద్దన్నారుట!

4 సాత్త్వికం

వాడు మానవుడు
రజోగుణ బ్రహ్మచే
సృష్టింపబడ్డాడు!
రాక్షసుడు కాకుంటే చాలు!
దేవుళ్లా ప్రవర్తించమంటే ఎలా?
పోనీ ఓ పని చెయ్యి!
నువ్వే వాణ్ణి
దేవునిలా క్షమించేసెయ్!
ఓ సారి ఆ కష్టమేదో నువ్వే పడు!
నీ సత్త్వం చూపించు!
అవునూ!
అందరూ దేవుళ్ళాంటి వాళ్ళైపోతే
ఇంక ఆ దేవుడనే వాడికేం
పనుంటుంది!

5 ప్రహసన్మానాలు

సన్మానాలు త్రిమానాలు
ఘన సన్మానం
మెచ్చుకొని చేసేది
ద్రవ(వ్య) సన్మానం
పుచ్చుకొని చేసేది
వాయు సన్మానం
మొహం వాచి
మనకు మనమే ఇచ్చుకొనేది
సందుల్లో గొందుల్లో సాహితీ సంస్థలు
తప్పులతడకల ప్రశంసా పత్రాలు
ఊరూ పేరు లేనివాళ్ళ
సంతకాల సర్టిఫికెట్లు
వదరుబోతు వక్తలు
చిత్రవిచిత్రాలైన బిరుదులు
రీ సైకిల్డ్ శాలువాలు
వ్యాకరణ నిరాకరణ
భాషా నిరాదరణ
పుచ్చుపూలతో వాణ్యర్చన
నోబెల్ బహుమతి కర్హమైన
రచననుకొంటూ
ఆత్మ వంచన!
పకోడీలు తిని పారవేసే కాగితంలో
ఓ మూల ప్రచురణ!
సాహితీ సరస్వతీ!
నేటికి నీకు పట్టిందిలాటి గతి
కాటుక కంటి నీరు
చనుకట్టు పయింబడ
నేల యేడ్చెదో!
పోతనలూ శ్రీశ్రీలు పోయారమ్మా
మన్నించమ్మా శారదమ్మా!
మమ్మల్ని భరించక
చేసేదేముందమ్మా!

6

ఉగాది కాంతాలాపం

ఉషోదయాన్నే కాలింగ్ బెల్లు మోగింది
తత్తరపడుతూ లేచి తలుపు తీసాను
ఎవరో! శోభాయమాన యువతి!
ఎక్కడో చూసినట్లుంది!
అనాహ్వానితంగానే లోపలికి కాలెట్టింది!
వాసంత సమీరం వ్యాపించినట్లైంది!
"నేను జ్ఞాపకం లేనా?
అబ్బో! షష్టిపూర్తయిందిలే మనం కలిసి!"
కోయిల కూతలా ఉంది మాట!
"ఏమో గుర్తు రావటం లేదు" అన్నాను
లేత మామిడి చివురు పెదాలతో నవ్వింది
"అప్పుడు నువ్వు ఇంత పిల్లాడివిలే!"
వేపపూవు తెలి రేకుల్లాంటి పలువరుస
ఇక్షురసం స్రవించినట్లంది!
"ఏమిటి పని? ఏం కావాలి?" అడిగాను
"నాకేం అక్కర్లేదు! నీకే ఇద్దామని వచ్చాను!"
మాకందపు పిందెల వగరు పలుకులవి!
"నీ పేరేమిటి? ఇచ్చేందుకు నువ్వెవరు? దేవతవా?"
"ఔను! ఈ ఏడాదికి దేవతను!
శోభకృత్ అంటారు నన్ను!
ఈ ఉగాది నుంచి మళ్ళీ ఉగాది దాకా!
మున్నూటరవై రోజులు నీతోనే!"
"రిక్తహస్తాలతో వచ్చావు! నువ్వేమిస్తావు?"
"నీ హస్తాలకు శక్తినిస్తాను

నీ ఆలోచనలను సాకారం చేసుకొనే ప్రేరణ నిస్తాను
నీ సంకల్పానికి చేదోడౌతాను
నువ్వు నువ్వుగా నిలబడటానికి
నీకు వెన్నెముక నౌతాను
నీకు కావలసింది నీవే సాధించుకో!
పిడికిలి బిగించు! మేధ నుపయోగించు!
బాగుపడ్డాని కనేక దారులు!
ఏదో దారిన పో! కదలకుంటే ఎలా?
ఎవరో ఏదో ఇవ్వాలనే భిక్షుకత్వం ఎందుకు?
గ్రహాలు అనుగ్రహాలు కందాయాలు
రాశిఫలాలు రాజపూజ్యాలు ప్రక్కన పడేయ్
నిజమే! జీవితం ఉగాది పచ్చడే!
దృఢ సంకల్పం అనే బెల్లాన్ని ఎక్కువ కలుపుకో!
నీ వెన్నుదన్నుగా తోడు నీడగా నేనుంటాను
ఉత్సాహంతో ఉరుకు! పరుగెత్తు!
ఉద్ధరేదాత్మ ఆత్మానం!"
నా అణువణువూ ప్రోత్సాహంతో పొంగింది!
రా రమ్మని నా హృదయ పీఠిక నిచ్చాను!
ఇంక ముందంతా మంచి కాలమేనని
మనసులో ఉప్పొంగుతూ ఉగాదిని స్వాగతించాను!
స్వస్తి సర్వేషాం!

ఆరున్నొకటి

యమాయమ

చిమ్మ చీకటి
నెత్తురు చిమ్ముతున్నట్లున్న
రెండు ఎఱ్ఱని కళ్ళు
కాంచన కాంతులతో కత్తుల్లాంటి
రెండు కొమ్ములు
ఊగుతూ కన్పిస్తున్నాయి
ప్రళయ భీకర ధ్వని లాంటి బుసలు
నా మెడచుట్టూ తోకలాంటిదేదో
చుట్టుకపోయింది
ఈడ్చుకు పోబోతోంది
గట్టిగా కోపంగా అరిచాను
"దండధరుడేడీ?
నువ్వెవరు లాక్కుపోవటానికి?
మా దేశంలో ఆర్థిక నేరస్తులను
రాజకీయ హంతకులను కూడా
ఉన్నత రక్షకాధికారులే వచ్చి
అరెస్టు చేసి
సగౌరవంగా రక్షణతో
తోడ్కొని వెళ్తారు!
నేను జీవితమంతా ఆయనకు
భయపడుతూ బ్రతికిన భక్తుడిని!
నీ యజమానికా మాత్రం
గౌరవించటం కూడా తెలీదా?
అహం బ్రహ్మాస్మి!
ఆయనే తీసుకుపోతేనే వెంట వస్తాను!
నీతో రాను ఫో! శివోహం!"
మెడ ఫ్రీ అయినట్లుంది
బుసల ధ్వని దూరమౌతోంది
ఎవరో నన్ను తట్టి లేపుతున్నారు
కళ్ళు విచ్చాను
ఎదురుగ్గా మెడలో స్టెత్ తో
భూతపతిలా ఒకరు!
"ఇంక ఫర్వాలేదు
బిల్లు కట్టేసి ఇంటికి వెళ్ళొచ్చు"
అన్నాడు
"బిల్లు ఆయనకొద్దు మాకివ్వండి
కట్టేస్తాం"
అంటున్నారు మావాళ్ళు
ముందు జాగ్రత్తగా!
మా వాళ్ళూ
నామీద ప్రేమున్నవాళ్ళే అన్నమాట!

8 ఆనంద కైరవి

కామధేనువు పొదుగులా
రాకా సుధాకరుడు!
పిండకుండానే
వెన్నెల పాల ధార ప్రస్రవించి
నింగీ నేలా తడిసిపోతోంది!
దూది పింజలతో
ఆకాశాన్ని తుడిచేసాను!
అక్కడక్కడ మిగిలిన
పాల చుక్కలు కాబోలు
నక్షత్రాలై
మిలమిల లాడుతున్నాయి!
ఈ నేల నిలాగే రాత్రంతా
వెలుగుతూండనీ!
ఈ తెలి అమృతతరంగిణిపై
నన్ను తేలియాడనీ!
రేపెలాగూ ఉదయభాస్కరుడు
తన కాంతి కిరణాల పొరకతో
ఊడ్చేసుకోవటానికి రానే వస్తాడుగా!

9 ఉపనిషదిజం

మన బ్రతుకు వ్యాపారం
ప్రారంభమైందే
మునుపటి జన్మలలోని
పాప పుణ్యాల పెట్టుబడితో!
పుట్టుకతోనే
కాపిటలిస్టులం మనం!
ఐనా మన వ్యాపారాన్ని
లోకాస్సమస్తాః సుఖినోభవంతుగా
వసుధైక కుటుంబకంగా
సాగించమన్నారు ఋషులు!
సోషలిజం
మన ధర్మంలోనే ఉంది!
ఇంకా కొత్తగా
నినాదాల గగ్గోలెందుకు?
అరిచే వాడెంత ఆచరిస్తున్నాడో
మటి?

10 ధైర్యమేవ జయతే!

సమస్యలే జీవితంలో థ్రిల్
సమస్యల్లేని జీవితం చప్పగా ఉంటుంది
నిజానికి సమస్యలే జీవితం
కొన్ని క్రుంగదీస్తాయి
కొన్ని వంగదీస్తాయి
కొన్ని కలవరపెడతాయి
కొన్ని కలలా అనిపిస్తాయి
ఝళిపిస్తాయి జలదరింపచేస్తాయి
ప్రతి సమస్యా పరిష్కారంతోనే పుడుతుంది
నిజానికి సమస్యలో దుఃఖం లేదు
దానికున్న పరిష్కార మార్గం నచ్చకే దుఃఖం!
చాలామటుకు అదే అసలు సమస్య!
సమస్యల సుడిగాలిలో చిక్కినపుడు
దానితో పాటు కొట్టుకు పోకుండా
ధైర్యాన్ని ఊతగా పట్టుకొని నిలబడు!
దాటిపోయే వరకూ పట్టు విడువకు!
కొన్ని ఆకులు రాలినంత మాత్రాన
కొన్ని కొమ్మలు విరిగినంత మాత్రాన
జీవిత వృక్షం మోడు కాదు!
కాకూడదు!
కన్నీళ్ళతో మనసు గాయాలకు కాపడం పెట్టుకో
వెక్కిళ్ళతో నీ గుండె ఆగకుండా చలింప జేసుకో
నీకు నువ్వే సమస్య అనుకోకు
నిన్ను నువ్వే మాపుకోకు!

11 స్వాభావికౌషధం

జింకకు ప్రకృతి పొడవైన
వాడి కొమ్ములిచ్చింది
వడిగా పరుగెత్తే కాళ్ళూ ఇచ్చింది
శునకాలైతే
కొమ్ములతో కుమ్ముతుంది
సింహం వస్తే కాళ్ళకు పనిచెప్తుంది
ఉరకాల్సిన చోట ఒదిగి
ఒదగాల్సిన చోట ఉరికితే
శృంగభంగం తప్పదని
మృగమైనా దానికీ తెలుసు!

బ్రతకటానికి బలం జ్ఞానం చాలవు
వాటితోపాటు
విజ్ఞత విచక్షణలూ
అత్యంతావసరం!
ఆ ప్రకృతే మనిషినీ సృష్టించింది
అదే సూత్రం నరుడికీ వర్తిస్తుంది!
విజ్ఞానం మందును
వివేకం అనుపానంగా
సేవిస్తూ బ్రతికితే
నయంకాని సమస్యా రోగాలే ఉండవు!

12 భళారే విచిత్రం

ప్రేమలో **పడటం** ఓ ఆక్సిడెంటే!
ఇదో విచిత్రం!
ఇందులో పడ్డవాళ్ళకేమీ
దెబ్బలు తగలవు! గాయాలు కావు!
ఐ సి యు లో చేరరు!
అవన్నీ తల్లిదండ్రులకు!
ఒండొకచో పెళ్ళానికి!
కొండొకచో మొగుడుంగారికీ!

షాకులూ! గుండె పోట్లూ!
మనసు తూట్లూ!
అజాగ్రత్తగా ఉన్న ట్రాఫిక్ పోలీసు
యాక్సిడెంట్ పాలైనట్లు!
లవ్వుక్కూడా ఇన్సూరెన్సుండాలి
కాంప్రహెన్సివో!
థర్డ్ పార్టీనో!
ఏదో ఒహటి!

13 పితృభ్యోనమః

చదువుకు రమ్మని పంపితే
అమెరికా అబ్బాయిని
చర్చిలో పెళ్ళాడి
హనీమూన్ కాగానే
ఆదరా బాదరా
పుట్టింట్లో వాలిపోయి
మీ అల్లుడు నాన్నా
మమ్మల్ని దీవించి
అక్షతలు చల్లండని
పాదాలమీద పడితే
సంప్రదాయం సొంతం చెడలేదని
సంతోషానికి గుండె కుండ పట్టక
ఒలికిపోకుండా చేత్తో పట్టుకొని
ఒరిగిపోతే
గుండె పోటనుకొన్నారంతా!
అది పగులని పోయినోడికే తెలుసు!
పోయాడు కాబట్టి మంచోడన్నారు!
బ్రతికుంటే డౌటే!

14 సెటిల్మెంట్

నేటి తల్లిదండ్రులెంత లక్కీఫెలోసో!
పిల్లకాయలను చదూకునేందుకు
ఓ సెలెక్టెడ్ కాలేజీలో పారేస్తే చాలు!
ఇక వాళ్ళ లైఫ్ సెటిలై పోతుంది!
అంతా కాంపస్ సెలెక్షనే!
ఉద్యోగం!
లైఫ్ పార్టనర్!
కుదిర్తే కూడటం!
లేదంటే తోడవటం!
కొందరికి కుళ్ళు!
తల్లిదండ్రులు
బాధ్యత(లు) లేని వారైపోతున్నారని!
తల్లడింపులూ తలదింపులూ
తిరోగమన భావాలు!
ప్రగతి నిరోధకాలు!
సంప్రదాయం ఛీంకరింపులకు
కాలం చెల్లింది!
అక్కడక్కడా గొణుక్కోవటమే
ఇప్పుడు మిగిలింది!

15 అంతేగా

చిన్నప్పుడు
తోపుడు బండి
పెద్దయ్యాక
గుఱ్ఱపు బండి
పెళ్ళయింతర్వాత
జోడెడ్ల బండి
వృద్ధాప్యంలో
ఒంటెద్దు బండి
ఆఖరికి ఓనాడు
దున్నపోతు వెంబడి!
జీవితం
మఱింతేనండీ!

16 విశ్వాత్మ

విష్ణువులో
విశ్వాన్ని చూస్తూ
ధూప దీప నైవేద్యాది
సేవలు సమర్పిస్తున్నావా!
గొప్ప భక్తుడివే!
అది విష్ణురూప దర్శనం!
విశ్వంలో
విష్ణువును చూస్తూ
నీ సేవలను విస్తరించు
గొప్ప జ్ఞానివౌతావు!
అదే విశ్వ రూప సందర్శనం!
అద్వైతావాహనం!

17 జీన్స్

నీలో ఉన్న తప్పులు
నీకు తెలియాలంటే
ఎదుటి వాడి నోసారి
తెగడి చూడు!
నీలో లేని ఒప్పులు
ప్రపంచానికి తెలియాలంటే
ప్రక్క వాడి నోసారి
పొగిడి చూడు!
పొగడ్త పడని వాడు
పొగడ్తకు పడని వాడు
ఏడేడు లోకాల్లోనూ
ఏ ఒక్కడూ దొరకడు!
దేవుడే స్తోత్రప్రియుడు!
మన జీన్సు ఆయనవేగా మఱి!

18 రివర్స్ స్వాప్

ఊబ తనువు
సన్న మనసు
ఇబ్బందే ఎప్పుడూ!
అందుకే
బాడీని సన్నబరుద్దాం!
మనస్సును లావెక్కిద్దాం!
మనకూ లోకానికీ
లాభమే లాభం!
ఇహానికీ పరానికీ
సుఖం సుగమం!

19 ధవుడు

ఆలి అనుకూలవతైతే
అర్ధ నారీశ్వరుడు!
తలెక్కి తైతక్కలాడితే
గంగాధరుడు!
తాండవ త్యాగ ధనుడు
లాస్య వీక్షణానిమిషుడు
ఏమైనా మగడు మొగుడే!
పత్నీ వశంకరుడే!
సతి ముందు స్థాణుడే!
సంసార గరళకంఠుడే!

20 హార్ట్ బీటింగ్

పిల్లలు
ఎంత గడుగ్గాయలు!
పసికందులుగా పారాడేటప్పుడే
కాళ్ళతో గుండెలమీద తన్నేస్తూ
సిపిఆర్ చేసేస్తారు
కేర్ కేర్ అంటూ ఆంగ్లంలో!
ముందు ముందు వాళ్ళు తెచ్చే
గుండెపోటులకు అడ్వాన్స్ గా!
ప్రివెన్షన్ యీజ్ బెటర్ దాన్ క్యూర్!
అనేమో!

21 అవివేకానానందం

గొడ్డలితో గడ్డం చేసుకొంటావా!
గునపంతో పల్లీలు వలుచుకొంటావా!
అంపంతో తల దువ్వుకొంటావా!
ఎవడి పిచ్చి వాడి కానందమే కాని
ఎల్లగడ్డ ఆసుపత్రి మీద జెండా పాత్తే
ఏం ప్రయోజనం సిద్ధిస్తుంది?
ఎవరెస్టు మీద ఎగరేయటానికి నడుం కట్టు!
ఆ నేర్పుతో ఓర్పుతో
సమాజాభివృద్ధికి తగిన పని చెయ్
జనం గుండెలతో జే జే కొట్టించుకో
చరిత్ర పుటలపై తరతరాలైనా
చెరగని సంతకం చేసేందుకు చెయ్యెత్తు!

22 వృద్ధంచమే

మనుషులు
నరమాంస భక్షణ
వదిలేసారు!
థాంక్ గాడ్!
లేకుంటే
వృద్ధాశ్రమాల బదులు
పశు కబేళాలతో పాటు
వృద్ధ కబేళాలు కూడా
వెలిగి పోతూ ఉండేవి!
చమకంలో ఓ పదం
నిశ్శబ్దమై పోయేది

23

దిష్టి

(కథాకవిత)

సాయంకాలం వాకింగ్ లో
కూరగాయలు కొందామని చూసాను
అప్పారావు రోడ్డులో శివాలయం ముందు
రోడ్డు ప్రక్కన ఓ అమ్మి దుకాణం!
నిగనిగ లాడుతూ వంకాయలు!
వెన్నెల రంగులో కళకళలాడుతున్నాయి!
కానీ కాయ కాయకొకటి రెండు మచ్చలు
"ఇవి పుచ్చులా? మచ్చలా!"
అమ్మిని అడిగాను గట్టిగా
"ఏమన్నారు మళ్ళీ అనండి"
"అదే! ఇవి పుచ్చులా? మచ్చలా?"
"బాగుంది! బాగుంది! వింటానికి బాగుంది!"
అమ్మి నవ్వుతూ మెచ్చుకొంది!
"మెచ్చటం సరే! ఇచ్చే దెంతకో చెప్పు"
"ఇదీ నచ్చింది" అంటూ మళ్ళీ నవ్వింది!
"కయిత్తం రాస్తారేమిటి మీరు?"
ఏదో వెతుకుతూ అంది!
డౌటొచ్చింది! సర్టిఫికెట్టిచ్చేందుకు కాయితం కోసం
వెతుకుతోందేమోనని!
"ఔను.. కాదు.." కంగారులో కవిసమ్రాట్‌లా అనేశాను!
"కయితం రాసేవోళ్ళకు తెలివెక్కువట కదా" అంటూ
పక్కనున్న పదేళ్ళ కొడుక్కి
పది రూపాయల నోటిచ్చింది!
అమ్మయ్య! కుదుటపడ్డాను.
"చదూకుంటున్నాడా! మార్కులు బాగా వస్తాయా"
యథాలాపంగా అడిగాను.

"జీరో ఐతే రావట్లేదు!" అన్నాడా చిచ్చర పిడుగు!
"అప్పుడప్పుడూ ఈడూ మీలాగానే మాట్లాడతాడు!
మరే! ఇందాకేమన్నవ్ అయ్యగార్కి సెప్పు" అంది అమ్మి!
"మాకున్నారు టీచర్లిద్దరు! చాకు పీసు సుద్దలు"
"భేష్! ఎవరన్నా సన్మానించారా?" అడిగాను వేళాకోళంగా
"అంటే?" అర్థం కాని ముఖం పెట్టారిద్దరూ!
"బాగా చెప్పావోయ్" అంటూ
సంచీలోంచి చాక్లెట్టు తీసి అతని కిచ్చి
భావి కవికి అడ్వాన్సు సన్మానం చేసే అదృష్టం
దక్కించుకొన్నాను.
"నీ కొడుకు మంచి కవి ఔతాడు" అన్నాను.
అమ్మి కలవరపడింది!
"కయిత్తాలెందుక్కాని వాళ్ళ మామయ్యలా
కాపొరేషన్ కాపురేటర్ ఐనా చాలు" అమ్మి తేల్చేసింది.
"బాలకుడు పాలకుడౌతాళ్ళే" ఆశీర్వదించాను.
"మళ్ళా కయిత్తమా! బాగుంది" నవ్వింది.
"ఇంతకీ ఈ తెల్లొంకాయలు బాగుంటాయా? తీసుకోనా?"
అడిగాను
"తీసుకోండి బాబూ. అవి పుచ్చులు కాదు. బగమంతుడు
పెట్టిన దిష్టి చుక్క మచ్చలు!"
మైండ్ బ్లాకయి బ్లాంకయింది!
బేరమాడకుండా వంకాయలు కొనుక్కొని
వడివడిగా ఇంటి త్రోవ పట్టాను.
మొగ్గేం తూచినట్లు లేదు.
అవున్లే
కవులకు మొక్కేదెవరు?
కవులవైపు మొగ్గేదెవరు?
రాయల తోనే ఆ రాజసం పోయింది!

(కొంత జరిగింది. కొంత కల్పన)

24 కాలక్షేపం

కాలం కాంతతో
సహజీవనం చేస్తున్నాను
జన్మల తరబడి!
ఏ జన్మలోనూ
మా నడుమ
హాట్ నథింగ్స్ తప్ప
స్వీట్ నథింగ్స్ జాడ లేదు
పుట్టిన ప్రతిసారీ ఏదో రోజు
అది నన్ను లేపుకుపోవటమే తప్ప
పెళ్ళాడిన దాఖలా కన్పించదు!
దీని తంతుతో విసుగొచ్చేసింది!
దీని బారిన పడకుండా
ఉండాలికనైనా!
ఈ మిండాటం తప్పాలంటే
ఉపాయం ఒకటే!
ఔను!
పుట్టటం మానేయటమే!

25 నా గుండె

భూమిలోనూ అగ్ని ఉంది
సముద్రంలోనూ అగ్ని ఉంది
ఏ కంపం పుట్టినప్పుడో
ఏ సునామీ ఎగసినప్పుడో
ఆ లావాలూ ఆ బడబాగ్నులూ
ఉగ్రంగా బయట కురుకుతాయి
దహించి ధ్వంసిస్తాయి!
నశింపజేస్తాయి!
ఈ నా గుండె
అది భూమో?
సంద్రమో?
బ్రద్దలైనా వ్రయ్యలైనా
దానికి దహించటం తెలియదు!
నిగ్రహించి సహించటమే తెలుసు!

26 న్యూమరాలజీ

ఆధార్కు నంబరు
పాన్ కు నంబరు
ఓటర్ కు నంబరు
ఇంటికి నంబరు
రేషన్ కు నంబరు
కొత్తేడాదికీ ఓ నంబరు
నంబరు మారిందానికి
ఇంతోటి సంబరాలెందుకు?
అర్ధరాత్రి అంకమ్మ శివాలెందుకు?
ఓవర్ నైటులో బ్రతుకులు
మారిపోతాయని బారుల్లో
కలలు కంటూనే తెల్లవారిపోతుంది!
సైకిల్ పోయి మెర్సిడీస్ రాదు!
ఫాన్ పోయి ఏసీ వీయదు!
నీ కలలు నీవే!
సాకారం చేసుకోవాల్సింది నీవే!
చేతుల్ని కట్టేసుకొని
కలల్ని పోగేసుకొంటుంటే
నీ నంబరు ఎప్పుడూ అడుగునే!
ఎక్కడి గొంగళి అక్కడే!

27 విరాడ్రూపి

విరాట్పూరుషుని కళ్ళలో
సూర్య చంద్రులున్నారుట!
మఱి నా కళ్ళలోనూ
విరాజమాన స్వరూపులే ఉన్నారే
ఆది దంపతు లొకదాంట్లో
అనాది దంపతు లొకదాంట్లో
ఈ కంట్లో తెలుపు శివుడు
నలుపు నారాయణి
ఆ కంట్లో తెలుపు పాలేటిచూలి
నలుపా నారాయణుడే!
మఱి నేను వేరే పూరుషుణ్ణెలా ఔతాను
విరాట్పురుషుణ్ణి కాక!
అహం శివః! అహం విష్ణుః!
అహం బ్రహ్మాస్మి!

28 ప్రస్థానం

మోడును తగలేయటానికి
కట్టెలవసరంలేదు
జ్ఞానయోగి
తన చిదగ్నిలో తానే
దహించుకు పోయినట్లు
తనకు తానే చితి ఔతుంది
మంత్రాలతో పనిలేని
మహా ప్రస్థానం!
ఇర్వురిదీ!!

29

యాన్యుటీ

ప్రతి పుట్టిన రోజుకూ
శుభాకాంక్షల రెన్యువల్!
ప్రతి పెళ్ళి రోజుకూ
బెస్ట్ విషెస్ రెన్యువల్!
ప్రతి న్యూ యియర్ కూ
గ్రీటింగ్స్ రెన్యువల్!
మెనీ మెనీ హాపీ రిటర్న్స్ ఆఫ్ ద డే!
శుభాకాంక్షలకూ ఆశీర్వాదాలకూ కూడా
ఎక్స్పైరీ డేటుంటుందా!
ప్రతి మరణ వార్షికానికీ
ఆబ్దికం రెన్యువల్
నిన్నటి బ్రతుకుకు నేడు
నేటిదానికి రేపు రెన్యువల్!
మునుపటి జన్మకు
ఈ జన్మొక రెన్యువల్!
ఓరి దేవుడా!
అయిన ఈ రెన్యువల్స్ ఇంక చాలు కాని
కర్మ బంధానికి ఈ జన్మనే ఎక్స్పైరీ డేట్ కానీ!
కుదరదంటే పోనీ
పై ఆరు లోకాల్లో ఎక్కడైనా పుట్టించు మఱి!
ఈ భూలోకంలో నువ్వొచ్చి పుట్టువు గాని!
నీకూ అవతారాల రెన్యువల్ ఉందిగా!
కల్కి అవతారం ఏదో బాకీ ఉందట కదా!

30 చిత్రం

ఈ
రంగులమయ
ప్రపంచాన్ని పరికిస్తున్న
నా
రెండు కళ్ళను
భగవంతుడు
బ్లాక్ అండ్ వైట్ లోనే
సృష్టించాడు!
వైట్ లో అంతర్లీనమై యున్న
సప్త వర్ణాలన్నీ
బ్లాక్ లో విలీనమై
విలయమై పోతాయనేమో!!
మనోనేత్రం సంగతేంటో తెలీదు!
మఱి
అదెప్పుడైనా తెఱచుకొంటే కదా!

31 అమావాస్య

తీరూ తెన్నూ లేదు కాని
మిణుగురుల్లా మెరిసిపోతున్నాయి!
ఆకాశానికి ఎన్నెన్ని దంతాలో!
అన్ని పళ్ళున్నా
చంద్రమస ఐస్ క్రీమును తినటానికి
పక్షం రోజులు పట్టింది!

32

అనుజీవనం

నేలతల్లే ప్రసవిస్తుంది
బొగ్గునూ! వజ్రాన్నీ!
బొగ్గుముక్కను ఎంత రాపాడినా
జిలుగులేమైనా సమకూరుతాయా?
మరో కోహినూర్ మణి ఔతుందా?
ఐనా దేని వినియోగం దానిదే!
చెరుకు గడా వెదురు బొంగూ
రెండూ భూమాతృ ప్రభవాలే!
చెరుకు మురళి ఔతుందా?
వెదురు మధుర స్రవమిస్తుందా?
ఐనా దేని విలువ దానిదే!
ఉప్పు కడలీ ఉంది
ఉత్కృష్ట భాగీరథీ ఉంది
కడలిలో కమలాలు పూసేనా?
గంగలో ముత్యాలు పుట్టేనా?
ఐనా దేని మహత్త్వం దానిదే!
ప్రకృతి సోషలిష్టు కాదు
కానీ ప్రతి సృష్టికీ ప్రయోజనం పెట్టింది!
పరస్పర సహ(న) జీవన సూత్రాన్ని కట్టింది!
దాన్ని గుర్తించి ఎక్కువ తక్కువ లనుకోకుండా
ఇగో ల గోల లేకుండా మనుగడ సాగిస్తే
మన కిక లోటేముంది? ఏముంటుంది!

33 మన స్మృతి

అనుభవాల త్రవ్వకాలు
గమ్మత్తైన జ్ఞాపకాలు
మెడుల్లా అబ్లాంగేటాలో
మేడ కట్టుకొన్న అనుభూతులు
కొన్ని తాపకాలు కొన్ని బాధకాలు
కొన్ని మోదకాలు కొన్ని ఖేద ప్రకోపకాలు
అవి ఎలాంటివైనా
గత జీవిత మాపకాలు
మునుముందడుగుకవే మార్గదర్శకాలు
వివేకానికి ప్రేరకాలు
పరిణతికి కారకాలు
అన్నింటినీ కలబోసి వడకట్టితే
అందరికీ దొరికేదొకటే దారి!
వదిలేయి అంకపొంకాలు
పాటించు అచ్చుకబుచ్చుకాలు
నిండుగా జీవించు పది కాలాలు
పొందేవు హాస హర్షాతిరేకాలు!

34 సరోగసీ

ఎవరెవరివో భావాలు
సేకరించి సంగ్రహించి
మెదడు పొరల్లో
దాచి
చిలవలు పలవులు అల్లి
పెంచి
వినే వాళ్ళ చెవుల్లోకి
డెలివరీ చేసే ప్రవాచకుల
ఉపన్యాసాలు కూడా
థాట్ సరోగసీ ప్రసవాలే!

35 పురోగతి

నాడు
సహచరత్వం
గర్భాధానం!
నేడు
సహజీవనం
గర్భదానం!
రేపు
సామూహిక జీవనం
గర్భ నిధనం!

36 దోమ ప్రేమ

ప్రేమా? దోమా? అంటూ
చేస్తాం కానీ అపహాస్యం
మనుషుల మధ్య లేని ప్రేమ
సమృద్ధిగా ఉంది మశకాలకు!
వద్దనే అవకాశమే ఇవ్వకుండా
ఒళ్ళంతా పగడాల ముద్దులు పెట్టేస్తాయి!
వాటి పెదవుల లిప్స్టిక్ చుక్కలతో
మన తనువంతా నిండిపోయి
ఇంద్రుణ్ణే మించిన శతసహస్రాక్షులం ఐపోతాము!
కొన్నైతే ఎంత ఆప్యాయంగా చుంబిస్తాయో!
చడీ చప్పుడూ లేకుండా!
దోమల **ఆల్ ఔట్** ప్రేమతో మనకు
ప్రతినైటూ **గుడ్ నైటే** కదా !

37 బాల్ఛీ భయం

ఎవరెస్టెక్కాను
ఫసిఫిక్లో ఈదాను
అంటార్కిటికాలో ఐసు మీద
ఆసనాలు వేసాను
పెళ్ళీ చేసుకొన్నాను
ఇన్ని కష్టకార్యాలు
ఆవలీలగా సిద్ధించుకొన్నానా
అదేమిటో
బాల్చీ తన్నాలంటే మాత్రం
భయం వేస్తోంది
ఇంత వయసొచ్చినా!

౩౮ వెయిటింగ్

సైఖోం మీరాబాయి చాను
నలభై తొమ్మిది కిలోలుంది తాను!
కామన్వెల్తు క్రీడల్లో
పైకెత్తి పడేసింది రెండొందలొక్క కేజీల్ని
పట్టేసింది పసిడి పతకాన్ని !
అరవైఏడు కేజీలు నేనున్నా
సంసార క్రీడలో
లెక్కలెనంత భారాన్ని మోస్తున్నా
అనంతుడు వేయి శిరసులమీద!
అష్టదిగ్గజాలు ఒక్కోటి ఒక్కో దిక్కును!
నేను మాత్రం ఒక్క తలమీదే!
నాకెన్ని పతకాలు రావాలన్నా?
దేవుడంపైరూ!
నిన్ను చూస్తునే ఉన్నా!
ఇంతవరకూ ఇచ్చింది గుండు సున్నా!
ఇదేం న్యాయమన్నా?
అన్లిమిటెడ్ వెయిట్ ఎత్తుకొని
ఇంతకాలం నుంచి మోస్తున్నా!
నాటే స్నాచ్ క్లీన్ అండ్ జెర్క్!
మోస్తూనే ఉన్నా మోస్తూనే ఉన్నా!
ఇంకా ఎంత కాలం వెయిట్ చే(మో)యాలన్నా?

39 నో ఆప్షన్

వయసు పాలు
వేడెక్కుతుంటే
పెళ్ళామనే
చల్ల చుక్కతో
తోడు పెట్టి
పెళ్ళి పెరుగు చేసారు
క్రొత్త వలపు మీగడంతా
ఖర్చయిపోయింది
తర్వాత చూస్తే ఏముందీ?
పెరుగంతా పుల్లనే!
సుఖమనేది కల్లనే!
తప్పేదేముంది!
మెంతి పెరుగో చల్లపులుసో
చేసుకొంటూ మ్రింగేయడమే!
పై కాప్షన్ జపించుకొంటూ
దద్ధోజనంలా బ్రతికేయడమే!

40 ద్వంద్వాతీతం

సిగ్గు శరం
వదిలేస్తే
ఐహికంలో
సుఖభోగి!
ఆధ్యాత్మికంలో
శుకయోగి!
నిర్ద్వంద్వంగా!!

41 దిటవు

“నీ మీద రాళ్ళేస్తే ఏరుకో!
వాటినే పునాది రాళ్ళుగా చేసుకో!”
అన్న వాణి విన్పించిన వాణ్ణి
నా వద్దకు పట్టుకురండి
ఆశ్చర్యంతో తానే ఓ రాయౌతాడు!
కాదా మరి!
నేను వాటితో పునాదే కాదు
గోడలు కప్పూ కూడా కట్టేసానుగా!
ఇంకా విసిర్తే
పై అంతస్తు కూడా కట్టడానికి
నా దగ్గర అప్రూవ్డ్ ప్లానుంది!
కొండల్నే విసిరినా ముక్కల్నిచేసే
మగరాయి వంటి గుండె నాకుంది!

42 వర్జ్యం

కొన్ని కావాలంటే
కొన్ని వదిలేసుకోవాలి
భగవంతుణ్ణి చూడాలంటే
భవబంధాలు వదిలేయాలి
భగవంతుణ్ణి కూడాలంటే
నిన్ను నువ్వే వదిలేసుకోవాలి!

43 మని(షి)కి

విచ్చుకుంటే చచ్చిపోవటం
తథ్యమని తెలిసినా
విరులు విరబూయటం మానేస్తాయా!
వేదన చెందుతూ విచారిస్తాయా?
ఉనికి క్షణభంగురమైనా
మనికిని మానేస్తాయా!
రంగుల హంగులతో
రంజిల్ల జేయవా!
వింత వింత తావులతో
ఉల్లసింప జేయవా!
మనిషి మనికీ అంతే మఱి!
నిన్న కంటే నేడు
నేటి కంటే రేపు
అభ్యుదయంగా బ్రతికేసేయ్!
ఎల్లుండి గూర్చి
ఎందుకు ఏడుపు?

44 పున్నమి జాబిలి

రాత్రి తేనెటీగ
రోజూ అరుణ కమలం నుంచి
కొంచెం కొంచెం
మకరందాన్ని సేకరించి
పదిహేను రోజుల్లో
పెట్టిన తేనెపట్టు!

45 స(న్నా)న్యాసి

ఇల్లు పట్టించుకోకుండా
తిరిగే వాడు
సన్నాసి!
ఇంటి పట్టు వదిలేసి
మెలిగే వాడు
సన్యాసి!
ఇద్దరూ భిక్షుకులే!
మొదటి వాడంటే
చీదరం!
రెండో వాడంటే
ఆదరం!

46 గుండె చప్పుళ్ళు

కోడెవయసులో
కంటికి నదరుగా కన్పిస్తే
రయంగా పరుగెత్తేది
లబ డబ లయ తప్పేది
పాడె వయసులో
శుక్ల నయనాలతో
లబలబ డబడబ!
ఇప్పుడెందుకు
శ్రుతి తప్పుతోంది!
విలయ మౌతోంది!

ఏమిటో?
ఈ బ్రతుకంతా
శ్రుతి లయలు సరి లేని
గుండె మద్దెల తాళం
నాద గందరగోళం!
ఆద్యంతం
గుండె గుబుళ్ళూ!
హార్టెటాకులూ!
దిక్కుమాలిన మనసు
చేసే ఉక్కిరిబిక్కిరులు!

47

పోయింది

(హాస్యకవిత)

హు! పోయింది!!
పోయిందో? పోగొట్టుకొన్నానో?
పోయిందని తెలిసాక
ఎంతో మధన పడ్డాను!
అంత విలువైనది మళ్ళీ దొరికేనా?
పోయినచోటే వెతుక్కోమన్నారు కదా!
అందుకే వెతుక్కొంటూ వెళ్ళాను
ఆ కళ్యాణమంటపాన్ని.
మంగళవారం అమావాస్య
ఖాళీగా ఉందంతా!
పనివాళ్ళంతా నవ్వుతూ తుళ్ళుతూ
శుభ్రం చేస్తున్నారు హాలంతా
అంతా కలియతిరిగి చూసాను
నేను పోగొట్టుకొన్న లాంటివి
అనూహ్యంగా
చాలా చాలా కన్పించాయి!
పాపం
నాలాంటి మంద భాగ్యులెందరో!
అందులో నాదేదో తెలియక
నిరాశగా తిరోగమించాను!
ఇంకోళ్ళది నాకెందుకు?
వాచ్మన్ కుర్రాడు ఎదురై
కుతూహలంగా అడిగాడు నవ్వుతూ
"దొరికిందా? ఏం పోయింది సార్?"
పాపం వాడికెట్లా చెప్పేది?
నేను పోగొట్టుకొన్నది
వాడి పెదాలమీద ఉందని!
ఐనా అదీ నాది కాదు కదా!
పాపం! ఇంకా
ఒంటరిగాడనుకొంటా!
తర్వాత వాడికీ ఉంటుందో
పోతుందో?
నాదింక నాకు దొరకదు!
ఇకపై నవ్వుకొనాలంటే
మరి నవ్వు 'కొనా'ల్సిందే!
ఓ దేవుడా! ఏమిస్తే అమ్ముతావు?
మరల నా నవ్వు నాకు!

శౌనకీయం

ఎన్నో కవితలు! ఎన్నెన్నో !
పెన్నుతో పొడిచాను!
ఎన్నో చప్పట్లు!
బలవంతపు బ్రాహ్మణార్థాలు!
మన వాడంటూ మా వాడంటూ
తప్పట్లూ తాళాలూ శాలువాలూ!
పరుపు మీద పడకేసినప్పుడు
పొరపాటున చేయి గుండె మీదకు వెళ్ళింది!
అనిపించింది! ఇన్నింటిలో
చిత్తు రాతలే కాని
చిత్కవితలు ఎన్నున్నాయి?
దీపావళి బాంబులే కాని
నిజమైన క్షిపణులెన్నున్నాయి?
ఔను! ఇకనుంచైనా
ఈ పెన్నుతో మిన్నుమీద మేడలు కట్టడం కాక
మన్ను తవ్వి మానవతా బీజాలను నాటాలి!
లేచాను ఆలోచనాత్మకంగా
ఆవేశపు విబూదిని ఒళ్ళంతా పులుముకొని!
నాతోపాటే మా పెరటి శునకుడు లేచాడు
దాలిగుంట నుంచి బూడిద దులుపుకుంటూ!

49 కళుకు టెఱుక

భూమి బల్లపరుపుగా ఉందని
నమ్మినంత కాలం
ఏదో ఓ మూలన
ప్రేమానురాగాలు దొరుకుతూండేవి!
కాదు భూగోళం అని
తెలిసిపోయిం తర్వాత
ఎక్కడా వాటి జాడే
కన్పించకుండా పోయాయి!
విజ్ఞానపు టీరోజుల కన్నా
అజ్ఞానపు టారోజులే మిన్నేమో!!

50 కీలు బొమ్మ

వయసులో ఉన్నప్పుడు
సంసార తాపత్రయం
నన్ను
కుళ్ళబొడిచింది!
వృద్ధాప్యంలో
ఫిజియోథెరపిస్ట్
కుళ్ళబొడుస్తున్నాడు
బ్రతుకంతా
కుళ్ళ(ళ్ళు) బోతే
కీళ్ళబొమ్మలాటే!

51

టైటిల్లేని కవిత!

పాలు పోసే వానితో
పాలు తెల్లగా ఉన్నాయన్నాను!
పొంగిపోయి పోతూపోతూ
మీరు "కవి గేదె" అంటూ బిరుదిచ్చి పోయాడు.
నేల బాగా ఊడ్చావమ్మా అన్నా పనమ్మాయితో!
కళకళ లాడే ముఖంతో
"కవి చీపురు" అని మెచ్చుకుంటూ పోయింది!
కూరలు తాజాగా బాగున్నాయోయ్ అన్నాను!
ఎంత బాగా చెప్పారండీ అంటూ
కూరిమితో "కవి కూర" అంటూ కౌగిలించాడు!
ఇస్త్రీ బట్టలు తెచ్చిన వాడిని మెచ్చుకున్నాను
చొక్కా కాలర్ ముడతలు లేకుండా చేసావని!
మీరు " ఇస్త్రీ కవి" అని కళ్ళనీళ్ళ పర్యంతం ఐపోయాడు!
బెండకాయ కూర భేషుగ్గా ఉందోయ్ అన్నాను
ఇంటావిడతో!
(వంటావిడను పెట్టుకునే స్తోమత లేని వాణ్ణి మఱి)
మీరు "కవి బెండ" అండీ అనీ తాను సైతం ఓ సమిధ
వేసింది బిరుదు యజ్ఞంలో
కానీ
కవి 'బొంద' అన్నదేమో అని ఓ డౌటైతే వచ్చిఏడ్చింది!
సరే ఏదో ఒకటి! ఇంటావిడతో పెట్టుకోగలమా!
ఇంకా మున్సిపాలిటీ శుభ్రదేవతను కలవలేదు!
కలిసింతర్వాత ఈ ప్రజా కవికి ఆవిడిచ్చే కొత్త టైటిల్
కూడా మీకు తెలియ చెప్తానేం!
అప్పటిదాకా ఇది టైటిల్లేని కవితే!

52

స్మేరస్మారము

అయ్యో! పోయింది!
పుట్టుకతోనే నాతో ఉన్నది!
పుట్టిన నుంచీ
నన్ను పట్టుకొని వేళ్ళాడింది!
ఎంత నిర్మలంగా ఉండేది!
నా దగ్గరున్న దాన్ని చూడాలని
ఎందరెంత తహతహలాడేవారు!
చూసి ఎంత మురిసిపోయే వారు!
నాతో పాటే వికసిస్తూ పెరిగింది!
బోసిగా..భోళాగా..కిలకిలా..కలకలా...
ఊహ పెరిగాక ఊసులేకుండా పోయింది!
లోకానికి కన్ను కుట్టిందేమో?
ఎవరు తస్కరించారో!
ఎప్పుడు లాక్కుపోయారో!
తెలియకుండానే మాయమైంది!
అంతులేని వేదనను నాకు మిగిల్చి
అంతు చిక్కకుండా పోయింది!
ఓ నా దరహాసమా!
నా అధర వాసమా
ఏమైపోయావు?
ఎక్కడున్నావు?
చక్కిలిగింతలు పెట్టినా
రాకున్నావు!

53 తత్ బ్రహ్మ

సున్నాకు సున్నాను కలిపినా
సున్నాలోంచి సున్నాను తీసివేసినా
ఉండేది సున్నాయే!
ఒకటిని ఒకటితో హెచ్చించినా
ఒకటిని ఒకటితో భాగించినా
ఉండేది ఒకటే!
సున్నాని ఒకటితో భాగిస్తూంటాడు
ఒకడు తత్త్వవాది!
ఒకటిని సున్నాతో విభాగించాలని
తపిస్తూంటాడు!
అతడు బ్రహ్మ వాది!!
అనంతంవైపే
అతడి చూపు!

54 అశోకం

ఆకాశమంత శోకం
ఘనీభవించి
నన్ను మంచు బొమ్మను చేసింది
కడలులు కన్నీళ్ళైనా
దీన్ని కరిగించటానికి చాలవు
లావాతో స్నానించినా
ఈ బొంద కరగేది కాదు
చితిపై కెక్కించి
బడబానలంతో ముట్టించండి
ఫటఫటమని ఫెళ్ళుమని
అశరీరుణ్ణై అశోకుణ్ణౌతాను!

55 అనంత శయనం

తొలి ఏకాదశి
ఆకాశం నిండా ముసురు!
భానుడూ శీతభానుడూ
పత్తా లేరు!
చూస్తుంటే
పద్మ పత్త్రాయతాక్షుడు
రెండు కళ్ళూ మూసుకొని
పడకేసినట్లే ఉంది మఱి!

56 స్వాహం

శంకరులన్నారు
సోహం
మధ్వులన్నారు
దాసోహం
రామానుజులన్నారు
దాస దాసోహం
అందరూ నిష్క్రమించారు
కాని
మనిషి మాత్రం
అంటూనే ఉన్నాడు
ఇహం! అహం!
స్వాహం నా మతం!
అహరహం!

57 పిచ్చి "మా" లోకం

కడుపులో ఉన్నప్పుడు
కాళ్ళతో తంతుంటే
చిన్ని కన్నని చిలిపి చేష్టని
ఓ కన్న తల్లి మమకారంతో
పొట్టపై చేయి పెట్టించి
మొగుడికి చెప్పి మురిసి పోతోంది
రేపు పాలు త్రాపిన రొమ్ముపై
ఎలా తన్నాలో ఇప్పట్నుంచే
ప్రాక్టీస్ చేస్తున్నాడేమో
జాగ్రత్తని ఎవరైనా చెప్పండి
ఆ పిచ్చి తల్లికి!

58 నాన్న

ప్రపంచం గోడపైన
కుటుంబం
పంచరంగుల బ్రతుకు పటం
వేలాడటానికి
తాను మేకై ఊతమిచ్చిన
నాన్న పటం
నేడు గోడపైన ఏ మేకుకూ
వేళ్ళాడటంలేదు
ఐనా
గుండెలో లేనిది
గోడపై ఉంటే ఒరిగేదేమిటి!
లేకుంటే మాత్రం తరిగేదేమిటి!

59 ఉద్ధరేదాత్మ...

వాడు స్వార్థపరుడు
వీడు దుర్మార్గుడు
వాడు మోసకారి
వీడు నమ్మకద్రోహి
వాడు తుచ్ఛుడు
వీడు నీచుడు
ఎంత కాలం ఇలా
పరుల గుఱించే బాధపడుతూ
జీవితమంతా ధారపోసేస్తావు!
పాపం నిస్వార్థంగా!
ఇంక వాళ్ళ మానానికి వాళ్ళను వదిలేసి
ఇప్పటికైనా తీరిక చేసుకొని
నీలోకి నువ్వు చూసుకో
నిన్ను నీవుద్ధరించుకొనేందుకు పూనుకో!

60 ఔరా!

అది గబ్బిలమే!
ఆంధ్రాదైతే
కవితా వస్తువయింది!
అభ్యుదయానికి ప్రేరణమయింది!
చైనాదైతే
రోగానికి హేతువయింది!
జనానికి మృత్యుకారణమయింది!
ఒకటి కలం మహిమ!
మరొకటి కాల మహిమ!

61 దైవబలం

దైవబలం ఉంటే
దర్భపుడకైనా
బ్రహ్మాస్త్రంగా మారుతుంది!
రాముడి చేతిలో లా!
దైవబలానికి ఎదురీదితే
బ్రహ్మ తలలాంటి అస్త్రం కూడా
నిర్వీర్యం అయిపోతుంది
అశ్వత్థామ చేతిలో లా!
దైవమే బలం!
సంకల్పానికైనా!
తత్ఫలానికైనా!
సత్ఫలానికైనా!

62 యద్యదాచరతి..

పెంపుడు కుక్క
బంతి వేసినా బాంబు వేసినా
నమ్మకంగా తిరిగి తెచ్చిస్తుంది.
సముద్రంలోకి దేన్ని విసిరేస్తే
దాన్నే మనవద్దకు తిరిగి పంపుతుంది
సుఖమో దుఃఖమో
దేవుడు మనకిచ్చేవన్నీ కూడా
అలాంటి రిటర్న్ గిఫ్టులే!
కర్మఫలాలే!
ఇచ్చేదెలాంటిదో
వచ్చేదలాంటిదే!

63 కొండంత ప్రతిమలు

విగ్రహాలు పెరిగిపోతున్నాయి
మొన్న కొండంత
నిన్న ఆకాశమంత
రేపు అంతరిక్షమంత
గుండె మాత్రం
కుంచించుక పోతోంది
నానాటికీ
చోటు లేకుండా
నివ్వరి ముల్లంత కూడా!
గుండెలో లేనిది
గుడిలో ఉం(టుం)దా!!
నిగ్రహంలో లేనిది
విగ్రహంలో ఉంటుందా?
విగ్రహాలు పెరుగుతున్నాయి
విలువలు తరుగుతున్నాయి!
ప్రతిమలు కొండలు దాటినా
మతులు నీతిని తాకవు
గుండెలు నిండట్లేదు
నిండుకుంటున్నాయి!

64 అంతర్బహిశ్చ...

జీవితాలెప్పుడూ చిక్కుముళ్ళే!
ఎండు బీర పీచు!
గిజిగాడి గూడు!
ఎక్కడ మొదలో? ఎక్కడ తుదో!
ఇంతా చేసి విచ్చదీస్తే
లోపల అంతా శూన్యం
వేదోపనిషత్తులను విప్పి చూస్తే
వేదాంతికి కనిపించే
బ్రహ్మపదార్థం!
బహిర్ముఖం ఇలా ఉందని
అంతర్ముఖుణ్ణైతే
అక్కడా ఇదే తంతు!
మూడు ముళ్ళూ!
ఆరు చక్రాలూ!
వెన్నెముక వంగిపోయినా
ఏ ముళ్ళూ వీడవు!
పోరాటం ఎంత చేసినా
పోయి రావటం తప్పట్లేదు!

65 అంతరాత్మ అస్తిత్వం

గడిచిపోయిన ఏళ్ళను గణిస్తే
బ్రతికినన్నాళ్ళింకా బ్రతుకబోననే
యదార్థం తెలిసి వచ్చింది.

మామిడిపండు దొరికిన పిల్లాడిలా
ఉంది నా అనుభూతి!
అంతా జుర్రేసినాక ఇక మిగిలిందేమీ లేదని
తెలిసినప్పటికీ చీకటం మానడు గదా వాడు!

నియమాలూ, విధి విధానాలూ, నియంత్రణలూ
వ్యర్థంగా చర్చించబడే కొలిక్కిరాని సమావేశాలు
వాటికై వెచ్చించేందుకు సమయం నాకు లేదు .

వయసు పెరిగినా బుద్ధి పెరగని
అసంగతపు ప్రేలుగొండులను
భరించే సహనం ఇంక నాలో లేదు.

నా కాట్టే సమయం లేదు.
అసలు సారం కావాలి నాకు.
నా ఆత్మ తొందరపడుతోంది.
ఈ బంగీలో నాకింక ఆస్వాదించదగ్గ
మాధుర్యం ఎక్కువేం మిగిలి లేదు.

తమ తప్పులకు నవ్వుకోవటం తెలిసినవారితో
తమ విజయాలకు తాము ఉప్పొంగని వారితో
తమ చేతలకు తామే బాధ్యత వహించే వాళ్ళతో

ఆ నిజమైన వాస్తవిక మనుషులతో పాటు
కలిసి బ్రతకాలని ఉంది!
అలాచేస్తే మానవత్వపు హుందాతనం మన్నుతుంది!
నిజం, నిజాయతీ నిలబడతాయి!
బ్రతుకు ప్రయోజనకరంగా సాగటానికిది అత్యవసరం!

బ్రతుకునీడ్చడంలో గట్టి దెబ్బలు తిన్న
వారి మనస్సులను
మృదువైన తమ మనస్స్పర్శతో తట్టగల
వారిమధ్య ఉండాలనేది నా కోరిక!

ఔను! నాకు తొందరగానే ఉంది!
పరిపక్వత వలన మాత్రమే లభించే
భావోద్వేగంతో బ్రతకాలని ఉంది!
ఇంకా అనుభవించాల్సిన తినుబండారాలను
వ్యర్థం చేయాలని అనుకోవటం లేదు.

అవి ఇప్పటిదాకా అనుభవించినవాటి కంటే
మరింత అద్భుతంగా ఉంటాయని నా నమ్మకం.
అంతస్సాక్షి గా నాకిష్టమైన వాటితో శాంతిని
సంతృప్తిని సంతరించుకొని తుదికి చేరటమే నా లక్ష్యం.

మనకు రెండు జీవనాలున్నాయి!
జీవితం ఒకే ఒక్కటి ఉందని తెలిసినప్పుడే
రెండోది మొదలౌతుంది!

(ప్రసిద్ధ బ్రెజీలియన్ కవి మారియో డి ఆంద్రాడే My soul has a hat కవితకు స్వేచ్ఛానువాదం)

66

వికృతులు

(సరదా కవిత)

భూకంపాలెందుకు పుడతాయి?
పిడుగు లెందుకు పడతాయి?
ఉప్పెన లెందుకు వస్తాయి?
తుఫాను లెందుకు సంభవిస్తాయి?
టోర్నడోలు ఎందుకు ఏర్పడతాయి?
దావానలం ఎందుకు పుడుతుంది?
కోవిడ్ వైరస్ ఎందుకు ఉద్భవించింది?
అగ్ని పర్వతాలెందుకు ఫట్ మంటాయి?
బెర్ముడా ట్రయాంగిల్ ఎందుకు మాయంచేస్తుంది?

పెళ్ళిళ్ళెందుకు జరుగుతాయి?

బిగ్ బాంగ్ ఎందుకు జరిగింది?
హు!.....హూ!
ప్రకృతి వైపరీత్యాలను ఎవరాపగలరు?

(ఓ వాట్సాప్ జోక్ ఆధారంగా)

67 మాయామేయం

హే అలర్మేలు మంగాపతీ!
నీ ఏడుకొండలు ఎక్కేంతవరకూ
విశిష్టాద్వైతిని!
అఖిలాండ బ్రహ్మాండ నాయకా!
నీ ఆలయంలోకి అడుగిడి
కులశేఖరపడి చేరేంతవరకూ
ద్వైతిని!
సచ్చిదానంద స్వరూపా!
నీ దర్శనానంత బ్రహ్మానంద తనువిస్మృతితో
ఇంక అయిపోతాను అద్వైతిని!
జగన్మాయా నాటక సూత్రధారీ!
వీడలేక వీడి ఆ నీ మ్రోల
చేరంగానే కొంపకు ఈ మూల
ఐపోతాను కోతిని!
మామూలు రీతిని!
కుప్పి గంతులు! సంసారచింతలు !
కళ్ళకు గంతలు! గానుగెద్దు తిరుగుళ్ళు!

68 దౌడు తీయి

కాలంతో కాలు కలుపు
కాలంతో పాటు కాలు కదుపు
కాలంతో పాటు పరుగెత్తు!
చేతకాకుంటే చక్రాలైనా కట్టుకో!
కాలంతో కబడ్డీ ఆడకు!
చేతులు కట్టుక కూలబడకు!
ఏ పాట్లైనా పడు!
ఎన్ని అగచాట్లైనా పడు!
కాలాన్ని పట్టుక వేళ్ళాడు!
సుఖంగా బ్రతుకీడుస్తావు!
కాలం కంటే వెనక బడకు
కాలం కట్టిన సమాధుల్లో ఒకటౌతావు!
చేతనైతే కాలంకంటే ముందుండు!
కాలాన్నే నీ వెనుక పరుగెత్తించు!
దార్శనికుడవౌతావు!
చరిత్ర సృష్టిస్తావు!
చరితార్థుడవౌతావు!
పది కాలాలపాటేమిటి
ఎన్ని కాలాలైనా బ్రతికుంటావు!

69 మనోఘోష

వీడు నన్ను బంధించాడు
ఏ మాత్రం కదలనివ్వడు
తిండిపై కోరిక లేదు
దాహం పై ధ్యాస లేదు
గవాక్షాలను మూసేసాడు
వెలుగును రానివ్వడు
చీకట్లోనే వెతుకులాట
చుట్టూ ఉన్న సృష్టిని
చూడనివ్వడు
ప్రకృతి అందాలకు
పరవశపడనీయడు
వెంటిలేటర్లను ఎప్పుడు మూస్తాడో
ఎప్పుడు తెరుస్తాడో తెలియదు
గట్టిగా శ్వాసించటానికి లేకుండా
ఉక్కిరి బిక్కిరి చేస్తాడు
ఓ మాట విననివ్వడు
ఓ పాట విననివ్వడు
ఓ రక్తి లేదు అనురక్తి లేదు
ఓ ముద్దు లేదు ముచ్చట లేదు
ఆనందం లేదు ఏడుపూ లేదు
అనుభవం లేదు అనుభూతి లేదు
ఎప్పుడూ ఏదో రొద
స్ స్ ఓ ఓ హ్ హ్ అమ్ అమ్!
విడవకుండా నా చుట్టూ!
ఓ భగవంతుడా!
మనసనే నన్ను ఇలా
ఓ మూలకు చుట్టేసి నెట్టేసి
దేనిమీదా మనసు పడని
ఈ పరమహంసల్లో
నన్నెందుకు పెట్టావు స్వామీ!

70

సేఫ్ టై

టగ్ ఆఫ్ వార్ ఆటలో
వెనకడుగే విజయాన్నిస్తుంది!
బాణం ముందుకు పోవటానికి
ముందుగా వెనక్కే వెళుతుంది!
ట్రిగ్గర్ ను వెనక్కి లాగి వదిలితేనే
బుల్లెట్ ముందుకు దూసుకవెళ్తుంది!
తిరగటానికి మొరాయించే పంకాను
కొంచెం వెనక్కి తిప్పితేనే ముందుకు తిరగటం!
కబడ్డీలో వెనుకడుగు వేసి
లైనును తాకితేనే విజయం!
ఫుట్ బాల్ ను కాలు వెనక్కి లాగి తంతేనే
గోల్ వైపు పోతుంది!
అంతెందుకు!
భీష్మతాతపై చక్రం విసిరేందుకు గాను
శ్రీకృష్ణుడు కూడా ఓ అడుగు వెనక్కి వేసాడు!
సంసారం కూడా తాడు లాగుడాటే!
అందుకే మొగుళ్ళూ పెళ్ళాలూ
కయ్యాటలో ఒకళ్ళు వెనక్కు రెండంగలేస్తే
ఎందుకైనా మంచిది
మీరు నాలుగంగలు వెనక్కి వేయండి!
ఇంకో రెండంగలు పక్కకేస్తే మరీ సేఫ్!
తాడు తెగేదాకా మాత్రం లాక్కోకండి మఱి!

71 నమామి భారతం

మొదటి సారి జాతీయ పతాకం ఎగిరినప్పుడు
భారతజాతి స్వేచ్ఛా వాయువులను పీల్చినప్పుడు
నేనింకా మొదటి శ్వాసనే తీసికోలేదు
కానీ
వెండి పండుగ చేసుకొన్నాను
పసిడి పండుగలో పాల్గొన్నాను
రవ్వ పండుగకు రంజిలుతున్నాను

వందేళ్ళ పండుగకు వందనం చేసే
ఆ అవకాశం అది దొరికేనో లేదో?

డెబ్భైయైదేళ్ళలో ఎంతో చూసాను
అండమంత అభివృద్ధి
ఆనపకాయంత అవినీతి
వసుధైక కుటుంబం అన్న సూక్తినాచరిస్తూ
వలసపోతున్న మేధావులను చూసాను
ఈ దేశపుబావుటాని నింగిలో ఎగరేద్దామని
ఇక్కడే ఉంటే జైలు ఊచలు లెక్కించేలా
చేసిన రాజకీయాలనూ చూసాను

ఈ దేశ సంపద ఒకప్పుడు పరాయి దేశాలకు పోయింది
ఇప్పుడు మాత్రం జరుగుతున్నదేమిటి?
బాంకులను కొల్లగొట్టే వాళ్ళు
ఓటుబాంకులను కొల్లగొట్టే వాళ్ళు

రాజుల్లా రంజుగా బ్రతికేస్తున్నారు
రైతు రాతలు మారటం లేదు
శ్రమ దోపిడీ ఆగటం లేదు
సామాన్య ప్రజల మూరెడు ఆశలకు
బ్రతుకెప్పుడూ బారెడు దూరమే!
జవానులకు హిమమే దుప్పటి!
గరీబీ హఠావో
జై జవాన్ జై కిసాన్
సబకా వికాస్ సబ్ కే సాథ్
ఈ అమృత వాక్కులతోనే
ఆజాదీ కా అమృతోత్సవం వరకూ
వచ్చేసాము
నూరేళ్ళ పండుగ నాటికైనా
మాటలు కోటలు దాటేనా?
చేతలు రాతల్ని మార్చేనా?
ఏమో? చూడ్డానికి
నేనుండకపోవచ్చు
కానీ నా ఆకాంక్షలుంటాయి!
నా ఈ దేశపు మువ్వన్నెల జెండా
మఱింత పొగరు సంతరించుకోవాలి!
ఈ సనాతన భారతావని
విశ్వానికి మళ్ళీ మార్గదర్శిని కావాలి!
జై భారత్!

(15.08.2022)

72 X ట్రాక్షన్

ఆమె రమ్మంది!
చెప్పిన సమయానికి
ఠంచనుగా తయారై వెళ్ళాను!
పాతిక ముప్పై యేళ్ళుంటాయేమో!
ఓ చిరు నవ్వు పారేసాను!
సీరియస్ గా కుర్చీ చూపించింది
దర్జాగా కూర్చున్నాను!
పళ్ళూడగొట్టి ఇక పొమ్మంది!
రెండు రాలిపోయాయి!
లోపల్నుంచి వాళ్ళాయనొచ్చాడు
నన్ను చూసి ఇకిలించాడు!
ఆమె డెంటిస్టు!
నేను పేషెంట్!
నో అట్రాక్షన్
నో ఎక్స్ట్రా యాక్షన్
ఓన్లీ ఎక్స్ట్రాక్షన్!

73 వెత (తుకు) లాట

మా అబ్బాయికోసం
పెళ్ళి కూతుర్ని ఎంత వెదుకుతున్నా
దొరకట్లేదు!
కాళ్ళు వాచేలా తిరుగుతున్నా!
కట్టుకుందామంటే బలపాలు కూడా
దొరకట్లేదు!
బుద్ధుడి కొడుకు పేరు పెట్టటమే
తప్పైపోయిందా?

74 నాటకాలరాయుడు

ఎన్ని నాటకాలాడానో
ఇప్పటి వరకూ!
ఎన్ని పాత్రలు మోసానో!
కొడుకు విద్యార్థి ఉద్యోగి
మొగుడు అల్లుడు తండ్రి మామ
మిత్రుడు శత్రువు పక్కింటి అంకులు
దరిద్రుడు ధనవంతుడు అనాథ
ఆస్తికుడు నాస్తికుడు నీచుడు ధార్మికుడు
ఎన్నో వెరైటీ వేషాలు!
కొండొకచో స్త్రీ వేషాలున్నూ వేసే ఉంటాను!
ఎన్ని నాటకాలాడానో? ఎన్ని సార్లాడానో!
ఏదీ! మునుపు ఆడినది గుర్తుంటేగా?
ఎప్పటికప్పుడు నాటకం మళ్ళీ మొదలే!
నానాటి బ్రతుకూ నాటకమే!
ఐనా ఇంకా యావ తీరలేదు!
ఈ మాయదారి నాటకాల మీద
విసుగు పుట్టట్లేదు!
కట్టకడపటి దాని మీదకు
మనసింకా పోవట్లేదు!
ఆడించే ఆ దర్శకుడికి
నాకంటే అనువైన నటులు దొరకట్లేదేమో!
ఇంకాఎంతకాలం నన్నిలా ఆడిస్తాడో మఱి!

75 తూర్పు – పడమర

దోసపందిరి పక్క
మంచం మీద కూర్చున్నాడు వాడు!
మగ్గిన దోసపండు
పుటుక్కున తొడిమనుంచి ఊడి క్రింద పడింది!
సాలోచనగా చూసాడు!
ఏనాటికైనా ప్రాణి గతి ఇంతేగా!
ఏదోనాడు దేహం క్రింద పడుతుంది
జీవుడు పైకి పోతాడు!
చంకలో జింకతోలు చేతిలో కమండులువుతో
అడివిలోకి దూరాడు వాడు!

ఆపిల్ చెట్టు కింద
సేద తీర్చుకొంటున్నాడు వీడు!
టుపుక్కున కింద పడింది పండు!
పైకీ కిందికీ చూసాడు!
కిందకే ఎందుకు పడింది?
పైకెందుకు పోలేదు?
చంకలో కాగితాలతో చేతిలో పెన్నుతో
ప్రయోగశాలలో దూరాడు వీడు!

సెయింట్ పిక్ వే వాడిది!
సైంటిఫిక్ వే వీడిది!

76 నిశ

పగలంతా పైకెగసిన కాలుష్యంతో
నీలి నింగి కాంతకు
తనువంతా నల్లకప్పేసింది!
ఆ మెరుస్తున్న చుక్కలు
మురికిని వదిలించుకోటానికి
ఒంటి మీద చల్లుకొన్న
మందాకినీ జలబిందువులు!
సబ్బు బిళ్ళ చందమామ!
తెల్లారేదాకా జలకాలే!
ఆపై సంజ వెలుగు తువ్వాలుతో
ఒళ్ళు తుడుచుకొంటుంది!
భాస్కరుని అంశు ధవళాంశుకంతో
పగలంతా ఒళ్ళు కప్పుకొంటుంది!

77 సామజ వరగమన

రోజూ చూస్తూంటాను అతగాణ్ణి
మందంగా మార్నింగ్ వాక్ చేస్తూంటాడు!
గ్రామసింహాలన్నీ అతన్ని చూసి
ఉన్నచోటు నుంచే తెగ గర్జిస్తూంటాయి!
నీలాటివాడు నడిస్తే చాలదు
పరుగెత్తితే కాని పని కాదనేమో!
వెంట పడితే ఏమన్నా ప్రయోజనం
ఉండొచ్చని వాటికీ తోచదు పాపం!
అవీ కదలవు
వాటికీ మార్నింగ్ తిరుగుడు అవసరం లేదుగా!
అవి ఎప్పుడూ జాగింగ్ చేస్తూనే ఉంటాయి మఱి!

78 అద్దం

అద్దం లోకి చూస్తుంటే
ఎవడో క్రొత్త వాడు కన్పించాడు!
అది నేనైతే మాత్రం కాదు!
ఎందుకంటే
ఆ కన్పిస్తున్న వాడికంటే
నేను యువకుణ్ణి!
అంత స్థూలంగానూ ఉండను!
అసలు ఆ పాత దర్పణాలన్నీ
ఎక్కడున్నాయి ఇప్పుడు
ముప్పై నలభై ఏళ్ళ క్రితం నేను వాడినవి!
ఇప్పుడు అన్నీ మారిపోయాయంటే
మీరూ ఒప్పుకొంటారని నాకు తెలుసు!
ఆ రోజుల్లో ఉన్నంత నాణ్యంగా
ఇప్పటి అద్దాలు లేవు మఱి!
అందుకని ముడుతలు కన్పించినా
చర్మం జారినట్లున్నా
ఆందోళనేమీ పడకండి!
నాకొక్క విషయం మాత్రం బోధపడింది!
మీ వర్చస్సులో పరిపూర్ణత
లోపించిందనిపిస్తే
నిజంగా సరిచేయాల్సింది అద్దాన్నే!

(ఐరిష్ ఫిలాసఫర్ ఎడ్మండ్ బుర్కే 1729-97
*రచన *ది మిర్రర్* కు యథానువాదం)*

79 మాంగల్యం గొంతునా..!

వాలికి ఇంద్రుడిచ్చిన
కంఠమాలిక లాగా
ఆలికి మొగుడు కట్టిన
మంగళసూత్రం!
ఎదుట పడితే చాలు
ఒంట్లో సత్తువంతా నశిస్తుంది!
భర్త "సు"గ్రీవుడి గ్రీవం
పెగలదే కదా!
రక్షించే రామబాణం ఏదీ?
భక్షించే భామ బాణం తప్ప!

80 బిచ్చగాడు 1,2,3

గుడి బయట కొందరు
గుడిలోపల కొందరు
గుడి గర్భంలో ఒకరిద్దరు
అందరూ బిచ్చగాళ్ళే!
అసలడగాల్సిందేదో మాత్రం
తెలియని పిచ్చివాళ్ళు!
ఐనా నిజానికి
అడగటం ఓ తంతు
ప్రారబ్ధం మన వంతు!

81 సహగమనం

బ్రతికున్నంత కాలం పతికి
తృతీయా తత్పురుష
సతీ సహగమనం తప్పనే తప్పదు!
స్వర్గీయ హసగమనుడైనాక
షష్ఠీ తత్పురుష
సతీ సహగమనం ఒప్పనే ఒప్పదు
అప్సరోగణ సహజీవనానికి
తనతో తంటా ఔతుందని!

82 హృదయగతం

నువ్వు కనిపించేదాకా
నాకు హృదయం ఉందనే
తెలియలేదు!
నువ్వు కనిపించకుంటే
అది తప్ప మరేమీ
ఉందనిపించటం లేదు!
నీకూ హృ**దయ** ముంది కదా!
అందులో దాగున్న **దయ**ను కాసింత చూపి
మోయలేని ఈ హాయిని
నాతో పాటు మోయటానికి
వచ్చి నీ చేయి వేయకూడదా ప్రియా

౮౩ దంత(తి) వేదాంతి

అంతటా కోలాహలం
సంబరం సంభ్రమం
ఏనుగు మీదకెక్కించారు
అంబారీని ఊరంతా ఏగించారు
జేజే ధ్వానాలు జేగంటల్లా మ్రోగాయి
చూసేవాళ్ళకు నయనానందం
పనసతొనల నిగనిగల స్ఫురద్రూపం
ఒంటినిండా
స్వర్ణ రజత ముత్యాల సరాలు
మధ్యలో ఓ సువర్ణ రుద్రాక్షమాల
వాటితో పాటుగా
ఓ గున్నగజ పూలమాల
పచ్చటి జరీ పట్టుపంచె
పట్టు ఉత్తరీయం
బంగారు కంకణాలు
గండపెండెరాలు
ఎవరీయన? ఎందుకీ ఉత్సవం?
ఇంత జరుగుతున్నా ఏం పట్టనట్లు
మరేదో లోకంలో
విహరిస్తున్నట్లుగా ఉన్న
పక్కనున్న మనిషిని వాకబు చేసాను
"ఎవరాయన? ఎందుకీ ఉత్సవం?"
ఈ లోకంలోకి వచ్చినవాడిలా
ఉలిక్కిపడ్డాడు!
అదే మళ్ళీ అడిగాను!
ఎగాదిగా చూసి అన్నాడు!
"వాడా!
మహా వేదాంతి! గొప్ప జ్ఞాని!"
చిత్రంగా నవ్వుతూ అన్నాడు!
"ఆయన నిన్నెరుగుదురా?"
"నేను వాణ్ణెరుగుదును
వాడే నన్నెరుగడు!
ఎందుకంటే
వాడినే వాడింకా ఎరుగడు!"
ఫుట్ పాత్ మీద ఎవరో పారేసిన
చింకిపాతను బుజాలచుట్టూ కప్పుకొని
ఏదో సందులోకి వెళ్ళిపోయాడు
పాంథునిలా!
"దంతిపై వేదాంతి దంత వేదాంతి"
అని గొణుక్కొంటూ
రథ్యాచర్పట విరచిత కంథః!
రమతే బాలోన్మత్తవ దేవ!

84 గ్రహణం

తల్లీ తండ్రీ పెళ్ళాం
అత్తా మామా
కొడుకూ కోడలూ
కూతురూ అల్లుడూ
నరుడి జీవిత కుండలిలో
వీళ్ళే నవగ్రహ మండలి!
గోచారం గుట్టు
సమగ్రంగా
ఇన్నాళ్ళకు సంగ్రహణమైంది!

85 గడ్డం మంచిదే

అడ్డాల నాడే బిడ్డలు కానీ
గడ్డాల నాడు కారు గదా!
అది చెప్పాలనేమో
ఇప్పుడు చాలమంది యువకులు
గడ్డాలు పెంచుతున్నారు!
పెళ్ళికూతుళ్ళూ ఇష్టపడుతున్నారు
అత్తా మామల పోరుండదుగా అనేమో?
అబ్బాయికీ అనువే!
పెళ్ళయాక అటూ ఇటూ ఐతే
కమండలు వొకటి కొనుక్కుంటే చాలు!
గడ్డం రెడీగానే ఉంటుంది కదా!

86 ఉ(అ)పదేశం

ఓయి ముసలోడా
కదిలిస్తే చాలు
కాచి వడబోసా జీవితాన్నంటావు!
నీ కషాయం ఇతరులకన్నా
ఏమైనా మెరుగా?
పైన మిగిలిందీ క్రిందకు జారిందీ
మిగతావారికి లాగే నీకూనూ!
అందరిలాగే పుట్టావు పెరిగావు
చదువొస్తే చదివావు
ఏదో దొరికిన పని చేసావు
నువ్వు తిన్నావు!
పెళ్ళాం పిల్లలకు పెట్టావు!
నీ వాళ్ళ బాగోగులు చూసుకొన్నావు!
చివరికిలా ముసలాడివయ్యావు!
నీ జ్ఞాపకాల వడపోతలో
ఈ ఆనవాళ్ళేమైనా కనిపించాయా?
నాల్గు మెతుకులెవరికైనా విదిల్చినట్లు?
ఎంగిలిచేత్తో కాకినైనా తోలినట్లు?
ఓ గుడ్డముక్క ఎవరికైనా కప్పినట్లు?
నాలుగక్షరాలు ఎవరికైనా నేర్పించినట్లు?
ఎవరికో జబ్బొస్తే
ఓ మందు బిళ్ళిచ్చినట్లు?
అపకారికి కాకుంటే మానె
ఉపకారికైనా చెయ్యివ్వకుండా
చేయూత నిచ్చినట్లు?
ఏదో ఊడబొడిచినట్లు
ఎందుకీ ప్రగల్భాలు?
స్వార్థమే కాని
లేశమైనా పరార్థం కాని జీవితం
నిండు నూరేళ్ళు సాగించినా
అది నేరం!
నీది పండిన జీవితం కాదు
ఎండిన బ్రతుకు!
వయసు మీరటంచే అయ్యావు కాని
ముసలాడివి
నీ గడిచిన కాలమంతా
జీవచ్ఛవానివి!
దేశానికి
కషాయోపదేశాలివ్వటం మానేసి
ఇతరులకోసం
ఏదైనా చేసి చూపెట్టు!
ఇకనైనా ఏ కొంచెమైనా !

87 ఎందుకిలా?

ఈ భూమి కెందు కింత సహనం?
ఎంత జనాభా పెరిగినా కిమ్మనదు!
ఈ చెట్టు కెందు కింత సంయమనం?
పూలు త్రుంచినా కాయలు కోసినా
కొమ్మలు విరిచినా
వేళ్ళతో పెకలించినా
కావలసినవన్నీ
అందిస్తూనే ఉంటుంది!
ఈ సూర్యుడికెంత వాత్సల్యం?
నమస్కారాలు చేసినా చెయ్యకున్నా
క్రమశిక్షణతో
వెలుగు పంచుతూ పోతూంటాడు!
ఈ చంద్రుని కెందు కింత ప్రేమ?
సూర్యుని వేడి తాను భరించి
ఉన్నంతలోనే
చల్లని వెన్నెల నిస్తూంటాడు!
ఈ నదులకి
ఎందు కింత ఉపకారగుణం?
ఎంత కలుషితం చేస్తున్నా
దాహార్తిని తీరుస్తూ
పొలాలను పండిస్తున్నాయి!
ఈ వాతావరణానికి
ఎందు కింత అపేక్ష?
కర్బన ఉద్గారాలతో
తూట్లు పొడుస్తున్నా
ఇంకా వర్షాలను కురిపిస్తూనే ఉంది!
ఈ పాడి పశువులకి
ఎందు కింత ఓర్పు!
దూడ మూతి కట్టేసి పాలు
పితుక్కొంటున్నా పొమ్మనవు!
ఈ కుక్క కెందు కింత కృతజ్ఞత?
ఎప్పుడో ఓ పిడికెడు మెతుకులు
విదిలించినందుకు
కనిపించినప్పుడల్లా
తోకాడిస్తూనే ఉంటుంది!
ఇదే ప్రకృతిలోనే నేనూ ఓ భాగమైనా
నేనెందు కిలా బ్రతుకుతున్నాను?
స్వార్థంతో క్రోధంతో
అసూయతో ప్రతీకారేచ్ఛతో
చితి మీద రగిలేదాకా
మనసులో రగిలి పోతూంటాను!
“నాకు నేనే” అనుకుంటూ
బ్రతికి చస్తూంటాను!
మళ్ళీ పుట్టినా ఇదే కదా తంతు!
ఎప్పుడు దీనికంతు?

౪౪

కర్మణ్యేవాధికారస్తే...



వాడు
పసి నాడు
గోడ పట్టుతో లేవబోతుంటే
చేయిచ్చి
వాడి కాళ్ళమీద వాణ్ణి నిలబెట్టి
సంబరపడ్డా!
బుడి బుడి నడకలేయబోతుంటే
వేలు పట్టి అరిసెలమీద అడుగులేయించి
మురిసిపోయా!
పెద్దయి వడివడిగా అమెరికా వెళ్ళి
అక్కణ్ణుంచి అమేజాన్‌లో
అందమైన చేతికర్రను ఆన్లైన్లో పంపితే
కుట్టు పంపిన కట్టును పట్టుకొని
నడుస్తూ ఆనందపడిపోతున్నా!
కర్మణ్యేవాధికారస్తే
మా ఫలేషు కదాచన!
మా పక్కింటి జ్ఞానానందానికి
వాళ్ళబ్బాయి అదీ పంపలేదట ఇంకా!
అసూయతో కుళ్ళుకొంటున్నాడు!

౮౯



శ్రీవారి హాస విలాసం

ఇలా నిలబెట్టారు నన్ను
పవళింపు సేవ దాకా ఇక ఇంతే!
పాపం దేవేరులు! అనపాయినులు!
నేను నిలుచున్నంతసేపూ వాళ్ళూ అంతే!
పాదాలెంత కందిపోతున్నాయో!

ఈ ప్రసాదాలతో సాంబ్రాణిపొగతో నీరాజనాలతో
కునికిపాట్లు వస్తున్నాయి
నిల్చునే రెప్ప వేద్దామన్నా వీలివ్వటంలేదు
క్షణక్షణానికీ గంటల గంటలు
అదుగో మళ్ళీ ఎవరో కొట్టారు

“మా అత్త కాల్చుకు తింటోంది
దాని బారినుండి నన్ను తప్పించు స్వామీ”

మళ్ళీ మరోగంట!

"ఈ కోడలు నన్ను కొరివిలా పట్టుకొంది
నన్ను తీసుకుపో స్వామీ!"

ఠాంగ్! ఠాంగ్! ఠాంగ్!
"సంసార మకరం నమిలేస్తోంది!
నీ చక్రం అడ్డేయి స్వామీ!" ..

"ఈ ఉద్యోగం నాకే వచ్చేట్లు చేయి!"
"వీసా ఇప్పించు స్వామీ!"

"ఈ టెండర్ నాకే వచ్చేట్లనుగ్రహించు!"
"కాలేజ్మేటు పంకజాక్షి నన్ను వలచేట్లు చూడు!"
"నన్నెప్పుడు మంత్రిని చేస్తావు స్వామీ!"

"నాకూ పద్మశ్రీ ఇప్పించు..వీలైతే పద్మభూషణ్"
ఓ గీతా ప్రవాచకుని అభ్యర్థన!

"పొంగలి మ్రింగి పోయేవాడే కాని
శఠగోపానికి ఎవరూ రావట్లేదు స్వామీ!"
ఆచారి ఆవేదన!

ధనుర్మాసంలో భక్తుల మానసాలలో
కోర్కెల బాణాలిట్లా సంధిస్తున్నారు!

"కర్మ! కర్మ! కర్మ"

వీళ్ళకెప్పటికి తెలుస్తుంది?
అవశ్యమనుభోక్తవ్యం
కృతం కర్మ శుభాశుభం!

మీ గీతలు మీరు గీసుకొన్నవే!
మీ అజ్ఞానానికే నా పెదాలమీద
ఈ పరిహాస మందహాసం!

90 శుభౌదయం




ప్రొద్దున్నే
ఉదయపు నడకకు
ఉద్యమించాను
నాకంటే ముందే
కొందరు
ఐరావతాల్లాంటి
కాలభైరవుల కెస్కార్టుగా
రోడ్డెక్కారు
సూర్యుడికి
శు"భౌ"దయం చెప్తూ!

91

అర్కార్ఘ్యం

నీలాభ్ర నీరధిలో
పైకెగసిన బడబానలంలా
ఈ వేసవి సూర్యుడు!
చూస్తే జాలేస్తోంది!
ఓ ఐస్ క్రీం తినలేడు!
ఓ కూల్ డ్రింకూ తాగలేడు!
నదులనూ సముద్రాలనూ
ఆవిరి చేయగలడు కానీ
ఓ నీటి బిందువునైనా
చప్పరించగా లేని పూర్ ఫెలో!
దోసెడు అర్ఘ్యజలమైనా
ఉష్ణకరుని గొంతు తడిపితే బాగుణ్ణు!
త్రిపదా మాహాత్మ్యంతో!



92 చాతుర్మాస్యం



నునుమెత్తని శేషశయ్య డోలపై
మామగారు కర లహరులతో
మంద్రంగా ఊపుతూంటే
బిసతంతు మృదుహస్తాలతో
పద్మజ పాదాలను పట్టూంటే
సుతిమెత్తగ నారదాదులు స్తుతిస్తూంటే
చతుర్ముఖుడు శ్రావ్యంగా
సామగానంతో జోకొట్టుతూంటే
పులిహోరలు చక్కెరపొంగళ్ళూ
భువన కుక్షికి భుక్తాయాసాన్ని కలిగిస్తూంటే...
అనుకొంటేనే ఆవలింతలు వచ్చేస్తున్నాయే!!!
ఆ భోగ నిద్రాయోగం నుంచి నేనైతే
ఏడాదికోసారి లేవటానికే ఏడ్చుకొనేవాణ్ణి!
నాల్గు నెలలే నిద్రించి
ఎన్మిది నెల్లపాటు మేల్కొనే ఉంటున్నావంటే
ఇందిరా రమణా!
నువ్వు దేవుడవే!
నిఝంగా దేవుడవే సామీ!

93

కొనబోతే కొఱవి

(జులై 2023)

ఎఱ్ఱని టొమాటోలు
ఎఱ్ఱెఱ్ఱని టొమాటోలు
ముదురెఱుపు రంగులో
అలిగి మూతి ముడుచుకొన్న
జవరాలి పెదవుల్లాగా
ఊరిస్తున్నాయి!
"కిలో ఎంతోయ్?" అడిగాను!
ఎగాదిగా చూసి అన్నాడు!
చిన్నపండైతే ఒకటి ఐదు!
పెద్దపండైతే ఒకటి పది!
"వామ్మో!" ఇంత ధరా!
ఇవి అధరాలు కావు!
అర్జునునిచే భంగపడిన
ఊర్వశి కోపారుణ నేత్రాలు!
ఎఱ్ఱని చూపుల నిప్పు కణికలు!



94 గిజిగాడి గూడు

ఎవరు నేర్పేరమ్మ
ఈ పిట్టకు
ఇంతందమైన గూడు
కట్టే నేర్పును!
ఏ మీడియంలో
ఇంజినీరింగ్ చదివావమ్మ?
ఏ ఐ ఐ టి లో నేర్చావమ్మ!
గాలిలో చిట్టి మేడనింత
గట్టిగా కట్టేవమ్మ!
ఇంత ఎయిర్ కండిషనింగ్ కూర్పు తెలివి
ఈ చిన్ని బుర్రలో ఎవరు దూర్చేరమ్మ?
విధాత సృష్టి విలాసానికి
విలాసమైన నీ గురించేమి చెప్పనూ!
పిట్ట కొంచెం తెలివి ఘనం!
పిచ్చుక గూడే కాని
పిచ్చిగూడు కాదు!




95 క్షీణే పుణ్యే...



డబ్బు లెవరికీ ఉత్తినే రావు!
భోగాలు కూడా!
స్వర్గంలో సురాపానం
అప్సరాంపతి వైభోగం కూడా!
భోగించే ప్రతి లిప్తకూ
నీ ఖాతా లోంచి
సంపాదించుకొన్న పుణ్యం
నీ ECS మాండేట్ అవసరం
లేకుండానే
ఆటోమాటిగ్గా కట్ ఐపోతూంటుంది!
క్షీణే పుణ్యే...తర్వాతేమిటి?
తాగుతూ తారుతూ ఉంటే

ఇలలో ఐతే అధః పాతాళం
ఇంద్రలోకంలో ఐతే అధః భూలోకం!
మర్త్యలోకం విశంతి!
పునరపి జననం!
మృగమో? మనిషో?
మృగం లాంటి మనిషో?
అందుకే ప్రయత్నించి
మంచిగా మనిషిగా బ్రతుకు
నీ పుణ్యం భగవంతుడి ఖాతాలో
వేసెయ్
మళ్ళీ తిరిగి రానక్కర్లేని లోకానికి పో!

96 నీకు నీవే శిల్పివి



పరిపూర్ణమైన మనిషివి కావాలంటే
నిన్ను నీవే మలుచుకోవాలి
బుద్ధి ఉలితో
అనుభవాల సమ్మెటతో
ఏది ఉంచుకోవాలో
ఏది తొలగించుకోవాలో
నువ్వే నిర్ణయించుకోవాలి!
అది ఒక తపస్సు
ఒక జీవితకాలంలో పూర్తికానూవచ్చు
కాకపోనూవచ్చు! కానీ...
పూర్తి శిలగా పడి ఉండటం కంటే
కొంతైనా శిల్పంగా మారితే
సమాజానికి నీవంతు స్ఫూర్తిని కలిగిస్తావు
ఏనాడో ఓ నాడు ఎవడో ఒకడు
ఆ చైతన్యంతో సంపూర్ణంగా
తన్ను తాను మలచుకోకపోతాడా!
సమాజానికి సన్మార్గదర్శియై
గుడిలో దేవునిలా వెలుగకపోతాడా!

97 పువ్వులా నవ్వు

ఎన్ని పెదవులిచ్చాడో
భగవంతుడీ గులాబీకీ!
పడిపడి నవ్వుతోంది!
రెండు పెదవులున్నా
ఒక్క నవ్వైనా నవ్వటం
తెలియని నన్ను చూసేనేమో?



98

తవచరణం మమ శరణం



నువ్వేమో చిద్విలాసంగా అరచేతిని
క్రిందికి చాపి నిలబడి ఉంటావు!
ప్రవాచక గురువులేమో
నీ పాదాలను పట్టుకోమంటున్నావని
అవే మా అందరికీ "పట్టుకొమ్మ"ని
కరతలామలక రహస్యం చెప్తున్నావంటారు!
తీరా ఏడుకొండలూ ఎక్కి
చిరుతల్నీ ఎలుగుల్నీ తప్పించుకొంటూ
ఎలుగెత్తి గోవిందా గోవిందా అంటూ
ఆపసోపాలు పడుతూ నిన్ను చేరుకొని
పట్టుకోవటానికెలాగూ పడనీయరు కదా
చూస్తూ మా హృదయ కమలాలతో నైనా

నీ పాదపూజ చేద్దామనుకొంటే
ఏవేవో పూలు తులసీదళాలూ
గోళ్ళైనా కనపడకుండా
పాదాలను కప్పేసి ఉంటాయి!
నీకు చెయ్యి తీపు
మా కాళ్ళు తీపు తప్ప
నీ ఉపదేశాన్ని పట్టించుకొనే వాడెవడు!
డబ్బుల వారం రోజున డబ్బులిస్తే
చూపిస్తామంటారు!
దానం ధర్మం చేయకుండా
దాచుకొన్న ధనంతో అనుమతి కొనుక్కొని వచ్చినా
చీకటి కప్పేసిన ఓ చిరు దీపం మాత్రం
కొడిగట్టి వెలుగుతూంటుందక్కడ!
నీ నడుముకు కట్టిన తెల్లగుడ్డ తప్ప
ఈ కళ్ళకు నీ పాదాలేవీ అగపడవు!
నీ మొహాన ఓ లడ్డూ కాసింత పొంగలి పారేసి
నిన్నూ నీ పేరునూ అమ్ముకుతింటున్నారు స్వామీ!
నువ్వో కాపీరైటు వైపోయావు!
ముందు ముందు నీ పేరు పెట్టుకోవాలన్నా
కరెన్సీతో వేలంపాడి
కొనుక్కోవాల్సిన రోజొస్తుందేమో!
శ్రీనివాసా!శ్రీ వేంకటేశా!
అంతా నీ మాయే అంటావా?
ఇదంతా నీ లీలే అంటావా?
అనుకోకపోతే నీ భక్తులం కాదంటావా?

99 చిరునవ్వే చిరునామా

ఒంటరిగా పూసానని
శోకించటం లేదు
తనకెవ్వరూ లేరని
రోదించటం లేదు
చిరునవ్వే చిరునామాగా
విప్పారిన ముఖంతో
పిలుస్తోంది
వాడి మన్నులో కలవకముందే
ఎవరైనా నన్ను
శివుడి శిరం మీదో
కేశవుడి కాళ్ళమీదో పడేస్తే
మూణ్ణాళ్ళ ముచ్చట బ్రతుకు
పుట్టించిన వాని సేవలో
పునీతమౌతుంది కదా అని!
సార్థకం ఔతుంది కదా అని!
తనను అక్కడికి చేర్చిన వానికీ
కొంత పుణ్యం దక్కుతుంది కదా అని!
మనిషీ! నీ సంగతేమిటి??



100 శివాయోం నమః




శివయ్యా రావయ్యా!
కైలాస హిమంలో
స్మశాన ధూమంలో
ఎంతకాలమని అలా
తాండవం చేస్తూ గడిపేస్తావు?
మా ఇంటికి దయచేయవయ్యా!
నాలుగ్గదుల ఇల్లుంది నాలో!
అన్ని గదులూ ఆక్రమించేసుకో!
నాకందులో ఇసుమంత కూడా మిగల్చకు!
ఆ గుండె గూటిలో దూరిపో!
నీ గుండెలో నన్ను పెట్టుకో!
గీతలో నీ సఖుడు చెప్పినట్లు
నేను తినేవన్నీ తాగేవన్నీ నీకు ప్రసాదాలే!
నీ నామామృతం నాకు చాలయ్యా!
విశ్వవ్యాపకా! కదిలేందుకు చోటే లేదా!
నా ఆలోచనోద్యానంలో సదా విహరించు!
నీ తలగంగతో దాన్ని తడుపు!
నీ లోచనాల కృపా వర్షంతో నన్ను తడుపు!
జూటసాదాఖ్యా! జ్ఞానచంద్రికలను ప్రసరించు!
శివాయోం నమః!

101 శశిరేఖ

విదియనాటి రాత్రి పైకి చూస్తే
బరువు నిట్టూర్పొకటి తన్నుకొచ్చింది!
భూమాత అంబరానికెన్ని కంతలో!
మధ్యలో ఓ సన్నటి వక్రరేఖ!
ఏదో పెద్ద చిరుగును కుట్టేసినట్లు!



పితృభ్యోనమః



వాస్తుజ్యోతిష విద్వాన్, దైవజ్ఞ రత్న,

కీ.శే. బ్రహ్మశ్రీ కవితా కామేశ్వరశర్మ,

కీ.శే. రాజ్యలక్ష్మి

కవితా ని ఇంటి పేరుగా

కవిత్వాన్ని ఒంటి పేర్మిగా

జన్మ బంధంగా ప్రసాదించిన జననీ జనకులు

ఈ జన్మకు చెల్లిపోయిన ఋణానుబంధాలు

అన్నంతమాత్రాన సరిపోయేనా

వందల వందల వందల వందనాలు!

- కవితా ప్రసాద్



రచయిత పరిచయం

రచయిత: కవితా (వేంకట సూర్య నారాయణ) ప్రసాద్

జననం: 1955

ఊరు: అవనిగడ్డ, కృష్ణాజిల్లా (ఆం.ప్ర)

తల్లిదండ్రులు: వాస్తు జ్యోతిష విద్వాన్, దైవజ్ఞరత్న బ్రహ్మశ్రీ కవితా కామేశ్వర శర్మ, రాజ్యలక్ష్మి.

చదువు: MSc (chemistry), (PhD), PG Dip. (Appd. Statistics)
స్కంధ త్రయ జ్యోతిషము (వారసత్వము).

వృత్తి: D.G.M (retd.), ONGC.

అభినివేశము: పద్య, వచన కవిత్వములు, కథారచన,
వాస్తు జ్యోతిష ముహూర్త శాస్త్రములు.

రచనలు: వివిధ పత్రికలలో పద్య గద్య కవితలు, కథలు, వ్యాసాలు,
ఆకాశవాణి పద్య సమస్యాపూరణలు,
వివిధ కవితా సంకలనములలో రచనలు.

గ్రంథములు: శ్రీ రాజశేఖర శతకము,
శ్రీ వేంకటేశ్వర ద్విశతి,
కొరోన వారణార్థనా పద్యపంచాశిక
కావవే కామేశ్వరీ!! (శతకము),
ప్రవచన కవితా (౽) కవితలు (వచన కవితా సంపుటి),
మాటవెలదులు (పరశ్శతకము),
ప్రపద్యాపీడము (ఖండ పద్యకవితా సంపుటి),
ఇష్టకథాష్టకము (కథాసంపుటి),
శ్రీ లలితా మధురాక్కరలు
ముహూర్త కామేశ్వరము,
పచన కవితలు మొ.